# స్ఫూర్తి

విద్యావిషయక మాస పత్రిక

సంపుటి : 50 సంచిక : 09 వెల : రూ. 18/- పుటలు : 36

శ్రీ పరాభవ నామ సంవత్సరం, శ్రావణ-భాద్రపద మాసములు సెప్టెంబర్ : 2026



విద్యా స్ఫూర్తి

డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్



శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత స్థాయి ఖేల్‌కూద్ 2026 పాలమూరులోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఆగష్టు 16, 17, 18 తేదీలలో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమము జరిగింది. ఉద్ఘాటనా కార్యక్రమానికి శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు గారు, వాలీబాల్, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు బండారి శాంతకుమార్ పాలమూరు మేయర్ మమత తదితరులు పాల్గొన్నారు. తదనంతరం అతిథులందరూ కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి ఖేల్‌కూద్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా పతకమూరి శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ ఖేల్‌కూద్ అనేది ప్రతీ సంవత్సరము శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో కొనసాగుతోందని తెలిపారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా వారిలో సర్వాంగీణ వికాసం జరగాలన్నదే శ్రీ సరస్వతీ విద్యాపీఠం లక్ష్యం అని అన్నారు. వివిధ రకాలైన క్రీడలను విద్యార్థులు ఆడడం ద్వారా, ఖేల్‌కూద్‌లో ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా విద్యార్థుల మధ్య స్నేహ పూర్వక స్పర్థ వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. అలాగే ఆటల్లో గెలుపు-ఓటములు అత్యంత సహజమని ఓటమి చెందిన క్రమములో నిరుత్సాహానికి లోనవ్వకుండా ఉంటూ, విద్యార్థులు నిరంతర సాధన ద్వారా తిరిగి గెలుపు తీరాన్ని చేరుకోవచ్చని సూచించారు. విద్యాభారతి, శ్రీ సరస్వతీ విద్యాపీఠంలో చదువుకుంటూ ఖేల్‌కూద్‌లో పాల్గొన్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణిస్తున్నారని, ఈ ఖేల్‌కూద్‌లో పాల్గొన్న వారు కూడా భవిష్యత్తులో మంచి ఉన్నతమైన క్రీడాకారులుగా రాణించి భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు. ఈ పోటీలకు మొత్తం 10 విభాగ్‌ల నుంచి 1620 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆచార్యులు 58 మంది, మాతాజీలు 50 మంది, ప్రబంధకుల 108 మంది ఇందులో పాల్గొన్నారు.

శిశు వర్గ, బాల వర్గ, కిశోర వర్గ అని విభజించి క్రీడలను నిర్వహించారు. అథ్లెటిక్స్, జట్టు స్పర్థలు, ఇండోర్ గేమ్స్ ఈ రకంగా విభజించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 70 అంశాల్లో, వ్యక్తిగత, జట్టు స్పర్థలు జరిగాయి. ఓవరాల్ ఛాంపియన్ షిప్ లో మొదటి విజేతగా భాగ్యనగర్ విభాగ్ నిలవగా, ద్వితీయ విజేతగా కరినగర్ విభాగ్, తృతీయ విజేతగా బి.హెచ్.ఈ.యల్. భారతీయ విద్యా సమితి నిలిచింది. కిశోర వర్గ కబడ్డి పోటీలలో మంచిర్యాల, భాగ్యనగర్ జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలిచాయి. బ్యాడ్మింటన్‌లో కరినగర్, సంగారెడ్డి, బి.హెచ్.ఈ.యల్, - వాలీబాల్ - మంచిర్యాల , సంగారెడ్డి , టెన్నికాయిట్ - సంగారెడ్డి బి.వీ.యస్., భాగ్యనగర్, చెస్ - భాగ్యనగర్, కరినగర్, క్యారమ్స్ - పాలమూరు, సంగారెడ్డి, బి.వీ.యస్ జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. కిశోర వర్గ బాలికా విభాగం నుంచి కబడ్డీ పోటీల్లో ఇందూర్, కరినగర్, బ్యాడ్మింటన్‌లో భాగ్యనగర్, పాలమూరు, వాలీబాల్- భాగ్యనగర్, ఆదిలాబాద్, టెన్నికాయిట్ - సంగారెడ్డి బి.వీ.యస్ చెస్-కరినగర్, సంగారెడ్డి, క్యారమ్స్ - ఆదిలాబాద్, ఇందూర్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులను ప్రదానం చేశారు.

ఇక ... సమారోప్ కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస రెడ్డి గారు, విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర రెడ్డి గారు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత అధ్యక్షులు, ఆచార్య తక్కళ్ళపల్లి తిరుపతి రావు గారు పాల్గొన్నారు.

యెన్నం శ్రీనివాస రెడ్డి ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ సరస్వతీ శిశుమందిరాల్లో చదువుతో పాటు విద్యార్థుల సంపూర్ణ వికాసం జరుగుతున్నదని అన్నారు. క్రీడా ప్రతిభకు పేదరికం అడ్డుకాదని విద్యార్థులు చదువుల్లో, క్రీడల్లో రాణించి ప్రయోజకులవ్వాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు ఎంత సహజమో, అలాగే జీవితంలో కూడా అంతే సహజమని క్రీడలు నిరూపిస్తాయి అని అన్నారు. విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర రెడ్డి గారు మాట్లాడుతూ శ్రీ సరస్వతీ శిశుమందిరాల్లో పంచకోశాత్మక వికాసం చెందేలా విద్యావిధానం ఉంటుందని అన్నారు. ఈ పంచకోశాత్మక వికాసంలోనే ఖేల్‌కూద్ కూడా ఒక అంశం అని వివరించారు. వివిధ రకాలైన క్రీడలను విద్యార్థులను ఆడడం ద్వారా పంచకోశాలు వికసనం చెంది విద్యార్థి సర్వాంగీణ వికాసం వైపు పయనిస్తారని అన్నారు.

# స్ఫూర్తి

విద్యావిషయక మాస పత్రిక


కలియుగాబ్ది-5128, శాలివాహన శక సం. 1948, శ్రీ పరాభవ నామ సంవత్సరం శ్రావణ-భాద్రపద మాసములు

సంపుటి : 50, సంచిక : 09, సెప్టెంబర్ 2026, పుటలు : 36, వెల : రూ.18/-



యాజమాన్యం

**శ్రీ సరస్వతీ విద్యాపీఠం**

సంపాదకులు & ప్రచురణ కర్త

యస్.యల్.యన్.ఆచార్యులు

**సంపాదకమండలి**

**డా॥ అన్నదానం వెం.సుబ్రహ్మణ్యం**

రావుల సూర్యనారాయణ

రమా విశ్వనాథన్

అన్నావఝ్జుల శ్రీనాథ్

పతకమూరి శ్రీనివాసరావు

శ్రీమతి అనఘా వెంకటలక్ష్మి

**ముద్రణ**

సాయి లిఖిత ప్రింటర్స్, ఖైరతాబాద్,

హైదరాబాద్-500004

**డి.టి.పి.**

**స్ఫూర్తి గ్రాఫిక్స్**

శ్రీ సరస్వతీ విద్యాపీఠము,

హైదరాబాద్ - 500086


**స్ఫూర్తి చందా వివరములు**

**స్ఫూర్తి వార్షిక చందా రూ॥ 220-00 లు**

డి.డి./ యం.ఒ. ద్వారా

శ్రీ సరస్వతీ విద్యాపీఠము పేరున

క్రింది చిరునామాకు పంపగలరు.


**శ్రీ సరస్వతీ విద్యాపీఠము**

ఇ.నెం.1-33, శ్రీశారదాధామము

బండ్లగూడజాగీర్,గండిపేట మండల్,రంగారెడ్డి జిల్లా

హైదరాబాద్ - 500 086.

ఫోన్ : 040-23316084

e - mail :sphoortissvp@gmail.com


## అమృతవాణి

శ్లో॥ అక్షరస్యాపి చ ఏకస్య పదార్థస్య పదస్య వా ।

దాతారం విస్మరన్ పాపీ కిం పునర్ధర్మ దేశినమ్ ॥

**భావము :** ఒక్క అక్షరమును కానీ, పదమును కానీ లేక పదము యొక్క అర్థాన్ని కానీ ప్రదానం చేసిన గురువును మరిచిపోయిన వాడు పాపాత్ముడు. ఇక మంత్రోపదేశము, వేద విద్యనిచ్చిన గురుదేవుని మరిచిన వాడింకెంత పాపియో గదా.

## ఈ సంచికలో . . .


| | |
|---|---|
| సంపాదకీయము | ... 04 |
| డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ | ... 05 |
| ఆత్మ నిర్భర భారత్ -2 "INS తారాగిరి" | ... 07 |
| జాతీయ ప్రసార దినోత్సవం | ... 09 |
| వినాయక చవితి | ... 11 |
| సుభాషితాలు చదవాలి! | ... 13 |
| ఆధునిక ఋషి దీనదయాళ్ | ... 15 |
| చిత్రమాలిక | ... 17 |
| శిశుమందిర్ బాలలు గీసిన చిత్రాలు | ... 21 |
| లోకజ్ఞానం - 214 | ... 22 |
| బడికి వేళైంది..... పిల్లలు లేవరేమిటీ? | ... 23 |
| విలువల విద్య | ... 25 |
| సంగీతానుభవం ... | ... 27 |
| ఆణిముత్యం - మన పూర్వ విద్యార్థి | ... 29 |
| వార్తలు | ... 33 |



Printed & Published by SLN Acharyulu (Pasarti Mallaiah) on behalf of Sri Saraswathi Vidya Peetham (Owner) and Printed at **Sai Likhita Printers**, # 6-2-959, D.B.Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd - 500004 and Published at Sri Saraswathi VidhyaPeetham, # 1-33,Sri Saradadhamam,Bandlaguda Jagir, Gandipeta Mandal, Rangareddy district, Hyd - 500086 (Publication Place) Editor : SLN Acharyulu (Dr. Annadanam Venkata Subrahmanyam)

# భారత జెన్-Z దారి తిప్పుతోందా?

నీట్ పరీక్షా పత్రం లీకేజీకి సంబంధించిన నిరసన కార్యక్రమం దేశాన్నే ఓ కుదుపు కుదిపింది. పరీక్షా పత్రం లీక్ కావడం విద్యార్థులకు నష్టం కలగడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, విమర్శించడం వంటి హక్కులు ప్రజలకున్నాయి. అది రాజ్యాంగ బద్ధమే. ప్రజాస్వామ్య దేశంలో అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు ఉంటుంది. అయితే నిరసన కూడా బాధ్యతాయుతంగా జరగాలి. అది హింసాత్మక చర్యగా పరిణమించకూడదు. జరిగిన తప్పిదాన్ని తెలుసుకొని, ప్రభుత్వం వెంటనే స్పందించి, సీబీఐ దర్యాప్తు చేపట్టి, అనుమానితులను అరెస్టు చేసి, అతి తక్కువ సమయంలోనే మళ్లీ రమారమి 22 లక్షల మందికి పరీక్ష నిర్వహించడం అనేది సామాన్యం కాదు. సంబంధిత మంత్రి కూడా నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా సమర్పించారు. అభినందిచదగ్గ విషయం. ఎందుకంటే 2007 సంవత్సరం నుంచి నేటి వరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన ఈ పరీక్షల్లో ప్రశ్న పత్రాలు ప్రతి యేటా ఎక్కడో అక్కడ బట్టబయలవుతున్నాయి. అయినా యే మంత్రి కూడా నైతిక బాధ్యత వహించి, రాజీనామా చేయలేదు. పరీక్షల మాఫియాను అరికట్టడానికి ఇప్పుడు చేసిన ఎన్.టి.ఏ. ఏర్పాటు, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాట్లు కూడా సముచిత చర్యగానే కనిపిస్తున్నాయి.

అయితే జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన ప్రదర్శన పేరుతో ప్రారంభమైన చర్యలో అతి తక్కువ మంది విద్యార్థులే పాల్గొన్నారు. అసాంఘిక, దేశద్రోహకర శక్తులు అందులో ప్రవేశించాయి. రమారమి 2,893 మంది నేరస్థులు విద్యార్థుల పేరుతో ప్రవేశించి అశాంతికి, హింసకు కారణభూతులైనారు. పైగా బాధ్యతాయుతమైన పదవుల్లో వున్న కొందరు వ్యక్తులు అక్కడున్న జెన్ జీని తప్పుదారి పట్టేలా ప్రేరేపించారు. ఇది దేశానికి మంచిది కాదు. శాంతిభద్రతలు కాపాడే పోలీసు యంత్రాంగాన్ని తీవ్రంగా గాయపరిచారు. దానినొక వీధి పోరాటంగా మార్చారు. ప్రభుత్వాలను కూలదోయాలి, రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలను బలహీనపరచాలనే కుట్రతో సాగిన నిరసన కార్యక్రమంగా కనిపించింది. కొన్ని దేశాలలో యువతను తప్పుదారి పట్టించి, అంత:కలహాలను సృష్టించి, ప్రభుత్వాలను పడగొట్టి దేశాన్ని అస్థిరం చేయాలనుకునే “డీప్ స్టేట్” దీని వెనుక నుంచి పనిచేస్తున్నదేమోనన్న కోణంలో కూడా దీన్ని ఆలోచించాలి. కాకపోతే విదేశాల నుంచి ఈ ఆందోళనకారులకు బిర్యానీ పాకెట్లు ఇతర సదుపాయాలు ఎలా అందాయి? ఎందుకు అందాయి? కూడా గమనించాలి. భారత దేశం చుట్టూ వున్న శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ లలో జరిగినట్లే భారత్ లో కూడా జరగాలనే విధంగా విచ్ఛిన్నకర శక్తులు పనిచేస్తున్నాయేమో కూడా నిశితంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

జన్ జీ అనగానే జంతర్ మంతర్ వద్ద పనిచేసిన యువతే అన్న భ్రమలో పడకూడదు. జన్ జీ అంటే నేటి తరం యువశక్తి. ఇది భారత దేశానికి ఉన్న గొప్ప సంపద. ప్రపంచంలో మరే దేశానికి ఇంతటి సంపద లేదు. గతంలో ఇలాంటి జన్ జీల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. ఇప్పుడీ స్వాతంత్ర్య ఫలాలను సంరక్షించుకునే బాధ్యతాయుతమైన ఆలోచన నేటి జన్ జీ చేయాలి. అభివృద్ధి చెందిన భారతంలో తాము జీవించాలనే కలలు గనాలి. ఆకాంక్షించాలి. అటువంటి ఆశయాలను ఆచరణలోకి తీసుకువచ్చే ప్రయత్నంలో అడుగులు ముందుకు వేస్తూ వుండాలి. అడ్డుపడే, పెడదారి పట్టించే జాతి విద్రోహ శక్తుల కుట్రలను గమనిస్తూ, అప్రమత్తంగా ఉండాలి. ★

ముఖ చిత్రకథనం

# విద్యాస్ఫూర్తి డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్

సెప్టెంబరు 5
ఉపాధ్యాయ దినోత్సవం

- పొన్నపల్లి జ్యోతి

గురువును పరబ్రహ్మగా భావించి బ్రహ్మ , విష్ణు, మహేశ్వరులతో పోల్చి వారి గొప్పతనాన్ని కొనియాడారు మన పూర్వీకులు. వ్యక్తిత్వాన్ని , నడవడికను, ప్రవర్తనను తీర్చిదిద్ది మనలో మార్పు తీసుకువచ్చే వాడు గురువు. అందుకే జన్మనిచ్చిన తల్లి, దండ్రుల తర్వాత స్థానం గురువుకు ఇచ్చి గౌరవిస్తున్నారు.

తనను తాను మార్చుకొని పదిమందికి దారి చూపే మార్గదర్శి - గురువు. ఒక దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్ళడంలో గురువు పాత్ర ఎంతో కీలకం. ఒక వ్యక్తి లేదా సమాజం ఉన్నతంగా ఎదగడంలో గురువు పాత్ర ఎప్పటికీ ఉంటుంది. గురువును పూజించడం ఎప్పటి నుంచో వస్తున్న ఆచారం. అయితే కొందరు గురువులలో ముఖ్యులైన డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి ఇలా స్మరించుకుందాం....

లోకంలో ఎంతోమంది జన్మిస్తున్నారు, వెళ్ళి పోతున్నారు కానీ కొందరు మాత్రమే కారణజన్ములు. వారిలో చిరస్మరణీయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. విద్య నేర్చుకోవడానికి ప్రతి వ్యక్తికి గురువు అవసరం. ఆ గురువే మనిషిలో సంస్కారాన్ని పెంచి, ఆదర్శవంతమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతాడు. అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి వెలుగును పంచే రవికాంతుడవుతాడు. సమాజంలో ఎలా బతకాలో నేర్పేవాడు గురువు.



మాజీ రాష్ట్రపతి కీ॥శే॥సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని. ఉపాధ్యాయ దినోత్సవంగా కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఉపాధ్యాయ వృత్తి నుంచి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన సర్వేపల్లి అందరికీ ఆదర్శనీయుడిగా నిలిచారు. సెప్టెంబర్ - 5న ఎంతో మంది శిష్యులు తమ గురువులను సత్కరించి తమ గురుభక్తిని చాటుకుంటారు. ప్రతి వ్యక్తి ఎదుగుదలలో తల్లిదండ్రులతో పాటు గురువు కూడా కీలక పాత్ర పోషిస్తాడు. విద్యార్థి విద్యాభివృద్ధికి తోడ్పాటు నందిస్తాడు, గురువు. అందుకే ఏడాదికి ఒకసారైనా గురువును పూజించాలనే ఉద్దేశ్యంతో కేంద్రం గురుపూజోత్సవానికి శ్రీకారం చుట్టింది.

**"గురువును పూజింపుమన్న-సంస్కారమును పెంచుమన్న"** అన్నారు కొందరు మహానుభావులు. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి మనల్ని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతూ సమాజానికి దోహదం చేస్తున్న గురువులకు ఒక్కసారి నమస్కరిద్దాం.

1888 సెప్టెంబర్ 5వ తేదీన తిరుత్తణిలో వీరస్వామి, సీతమ్మ దంపతులకు కలిగిన సంతానం- రాధాకృష్ణన్ గారు. ఈయన తిరుత్తణిలో ప్రాథమిక విద్యను అభ్యసించి బాల్యం నుండే అఖండమైన తెలివితేటలు చూపిన వ్యక్తి ఈయన. రాధాకృష్ణన్ ను చూసి ఉపాధ్యాయులంతా ముగ్ధులయ్యేవారు. తరువాత కళాశాల విద్య, ఎం.ఏ. పట్టా పొందారు. విద్యార్థిగా **ఉన్నప్పుడే** మనస్తత్వ శాస్త్రం పై బాగా అధ్యయనం చేసి

ఉపన్యాసాలు ఇచ్చేవారు. స్వశక్తితో, అసాధారణ ప్రజ్ఞతో పైపైకి ఎదిగి పలువురికి మార్గదర్శకంగా, తన వృత్తి ధర్మానికి "మకుటం" గా వెలిగారు. కొని తెచ్చుకున్న గౌరవం కాక "కొలిచి" తెచ్చుకున్న గౌరవం ఆయనను వరించింది. ఏ పనిలోనైన నిబద్ధత కలిగి ఉండాలని ఆయన జీవితం మనకు పాఠం చెప్తుంది. సర్వేపల్లి జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం.

రాధాకృష్ణన్ కు 16 సం॥ల వయసులోనే శివకామేశ్వరితో సంప్రదాయం ప్రకారం వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు.

21 సం॥లు దాటని వయసులో ఆయన మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసర్ అయ్యారు. తర్వాత 1918 నుండి 1921 వరకు మైసూర్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలోను 1931లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా పని చేశారు. మరియు 1946లో ఏర్పడిన భారత రాజ్యాంగ పరిషత్ సభ్యులయ్యారు.

**గౌరవ పురస్కారాలు-మన్ననలు :-** 1954లో భారతరత్న బిరుదు, 1961లో జర్మనీ పుస్తక సదస్సు యొక్క శాంతి బహుమానం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆక్స్‌ఫర్డు, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాల నుండి వందకు పైగా గౌరవ పురస్కారాలు, డాక్టరేటులు సంపాదించారు. వేదాంతాలలోని నియమాలు , రవీంద్రుని తత్త్వము, భారతీయ తత్త్వము, హృదయము, నా సత్య శోధన, గౌతమ బుద్ధుడు మొదలగు గ్రంథాలను రచించాడు. రాధాకృష్ణన్‌ది పేద కుటుంబము. ఉన్నత విద్య చదివించే స్థోమత లేదని తండ్రి వీరస్వామి కొడుకును పూజారిగా చేయమన్నారు. కానీ రాధాకృష్ణన్‌కు చదువంటే ప్రాణం. అందుకే ఉన్నత పాఠశాల చదువుకోసం తిరుపతిలోని మిషనరీ పాఠశాలలో చేరారు. అప్పటి నుంచి ఈయన చదువంతా ఉపకార వేతనాలతోనే సాగిపోయింది. రోజులో 12 గంటల పాటు పుస్తకాలు చదువుతూ ఉండేవాడు. ఎన్నో విలువైన వ్యాసాలు, పరిశోధనా పత్రాలను రాసేవారు. యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్ లో సభ్యుడిగా ఉండి మన విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎన్నో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు రాధాకృష్ణన్.

1952లో భారతదేశ మొదటి ఉపరాష్ట్రపతిగా, 1962లో భారతదేశ రెండవ రాష్ట్రపతిగా అత్యున్నత పదవులు చేపట్టారు. అత్యుత్తమైన "భారతరత్న" పురస్కారం దక్కింది అయినా ఏనాడు ఆడంబరాలకు పోలేదు. మహా మేధావిగా, గొప్ప వక్తగా, గ్రంథకర్తగా, ప్రపంచ దేశాల మన్ననలందుకున్న డా॥రాధాకృష్ణన్ భారతీయ మహర్షుల కోవకు చెందినవారు. రాష్ట్రపతి పదవీ విరమణ చేసిన తర్వాత (1967) చివరిరోజు వరకు మద్రాసులోని తమ భవనంలో, తాత్విక చింతన చేస్తూ 17.4.1975న పరమపదించారు.

వేదాంత విజ్ఞానంలో ప్రపంచానికి ఒక కొత్త మార్గం చూపించిన వ్యక్తి ఈయన ప్రతిభాసామర్థ్యాలు అనితర సాధ్యం. ఒక సాదాసీదా కుటుంబంలో జన్మించి పాఠశాలలో ఉపాధ్యాయుడుగా జీవితం ఆరంభించి, దేశంలో అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి పీఠం అధిష్ఠించిన వ్యక్తి . రాష్ట్రపతిగా పనిచేసే రోజుల్లో అతని పుట్టిన రోజున ఘనంగా సన్మానాలు చేయడానికి వచ్చిన వారితో ఇలా అన్నారు. నాకు ఇవన్నీ ఏమీ వద్దు. నా పుట్టిన రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకొని ఉపాధ్యాయులను సత్కరించండి. నేను ఎంతో గర్విస్తాను అని చెప్పి ఉపాధ్యాయ వృత్తిపట్ల తన ప్రేమను చాటారు. ఆచార్యునిగా ఆయనను గుర్తించిన భారతదేశ ప్రభుత్వం 1962 సం॥నుండి అతని పుట్టిన రోజు అయిన సెప్టెంబర్ 5వ తేదీని **"గురు పూజోత్సవంగా"** ప్రకటించింది. ఇలా జరుపుకోవటం ఎంతో సముచితం. ఉపాధ్యాయ వృత్తికి ఆదర్శంగా నిలిచిన ఆచార్యుడు డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్. ★

# ఆత్మ నిర్భర భారత్ -2 "INS తారాగిరి"

- కార్తవీర్యార్జున

**ఆత్మ నిర్భర భారత్ (మేకిన్ ఇండియా) వైపు మన దేశం వేగంగా అడుగులు వేస్తోంది. వివిధ రంగాలలో ఇప్పటికే మన దేశం తయారు చేసిన వివిధ రకాలైన వస్తువులు వినియోగంలోకి వచ్చేస్తున్నాయి. దీని ద్వారా ఇతర దేశాల నుంచి దిగుమతులు కూడా తగ్గుతున్నాయి. రక్షణ రంగంలో ఈ వృద్ధి ఎక్కువగా వుంది. దీంతో మన దేశ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం అవుతోంది. దీంతో మన ప్రజల ఆత్మ విశ్వాసం కూడా పెరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా మన దేశం ఎంత బలంగా వుందో సత్తా చాటినట్లు కూడా కనిపిస్తోంది.**

**ఇప్పటికే మన భారత్ స్వదేశీ టెక్నాలజీతో కొన్నింటిని ఆయా రంగాలలో తయారు చేసింది. అవి విజయవంతం అయ్యాయి కూడా. మన భారత్ శక్తి సామర్థ్యాలు మనం కూడా తెలుసుకోవాలి, పది మందికి చెప్పాలి. అందుకే "ఆత్మ నిర్భర భారత్" పేరుతో వాటి గురించి వివరంగా విద్యార్థుల కోసం "స్ఫూర్తి పత్రిక" అందిస్తోంది.**

**భా**రత్ అత్యంత వేగంగా ఆత్మ నిర్భర భారత్ వైపు ప్రయాణిస్తోంది. స్వదేశీ టెక్నాలజీతో యుద్ధ నౌకల నిర్మాణం జరుగుతోంది. కేవలం జరగడమే కాదు.. ఏకంగా రంగంలోకి కూడా దిగుతున్నాయి. ఇందులో భాగంగానే ఐఎన్ఎస్ తారాగిరి నౌక. విశాఖ నేవల్ డాక్ యార్డులో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ చేతుల మీదుగా దీనిని కమిషన్ చేశారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17-ఏ లో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధ నౌకను ముంబైలోని మజగాన్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికి పైగా సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయ్యాయి. శత్రువుల రాడార్ లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం తారాగిరి సొంతం. శత్రువుల రాడార్ కి కనిపించకుండా పనిచేసే సామర్థ్యం గల ఈ వార్ షిప్, విశాఖ కేంద్రంగా సేవలు అందిస్తోంది.

నిజానికి దీనిని ఎండీఎల్ 93 నెలల్లో పూర్తి చేయాలని మొదలు పెట్టింది. అయితే.. ఈ వార్ షిప్ ను కేవలం 81 నెలల్లోనే పూర్తి కమిషనింగ్ కి సిద్ధం చేశారు. దీనిని బట్టి మన ఆత్మ నిర్భర భారత్ సామర్థ్యం ఏమిటో తెలిసి వచ్చింది.



INS తారాగిరి

149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువు వుంటుంది. కంబైన్డ్ డీజిల్ - గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణిస్తుంది.

ఇందులో నిశ్శబ్దమైన ఫిరంగులతో కూడిన ఆధునికత సాంకేతికత వుంటుంది. బరాక్ -8 వంటి విమాన విధ్వసంక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో వున్నాయి.

యాంటీ సబ్ మెరైన్ వార్ ఫేర్ వ్యవస్థతో పాటు శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వుంటుంది. అలాగే ఆధునిక కంబాట్ నిర్వాహణ విధానం ద్వారా శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ కూడా వుంది. బరాక్-8, వంటి విమాన విధ్వంసక 8

(తరువాయి భాగం 12వ పుటలో...)

# విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలి : ప్రొ॥ తిరుపతి రావు




శ్రీ సరస్వతీ విద్యాపీఠం, భాగ్యనగర్ విభాగ్ ఆధ్వర్యంలో ఆగస్టు 24,25 తేదీల్లో జ్ఞాన విజ్ఞాన, గణిత మేళా జరిగింది. శ్రీ సరస్వతీ శిశు మందిర్ శివరాం పల్లి పాఠశాల కేంద్రంగా జరిగింది. ఈ రెండు రోజుల మేళాలో మొత్తం 604 మంది పాల్గొన్నారు. అందులో బాలురు 204 కాగా, బాలికలు 280 మంది, ప్రబంధకులు 20, న్యాయ నిర్ణేతలు 15 మంది, అధికారులు 9 మంది, వెంట వచ్చిన ఆచార్యులు 26 మంది, స్థానిక పాఠశాల విద్యార్థులు 40 మంది వున్నారు.

కార్యక్రమ ఉద్ఘాటన కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి శ్రీమతి అనఘా వేంకట లక్ష్మీ గారు, విభాగ్ కార్యదర్శి విరివింటి రవీంద్ర శర్మ గారు, విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ కాసోజు భూషణ్ గారు పాల్గొన్నారు. అనఘా వేంకట లక్ష్మీ గారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి వున్న ప్రతిభను వెలికి తీయడానికి, విద్యాపీఠం ప్రతి యేటా విజ్ఞాన, గణిత మేళాలు నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా సైన్స్ కి, ఆధ్యాత్మికతకు వున్న సంబంధాన్ని ఆవిష్కరించారు. అదే విధంగా డీఆర్డీఎల్ శాస్త్రవేత్త రాజ్ కుమార్ గారు చివరి రోజు విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం తీసుకున్నారు. అలాగే శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత అధ్యక్షులు ప్రొఫెసర్ తిరుపతి రావు గారు నేటి అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. ★

---

బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు కూడా కలిగి వుంటుంది.

హిందూ మహాసముద్ర ప్రాంతంలో (IOR) చైనా కదలికలు పెరుగుతున్న నేపథ్యంలో, INS తారాగిరి కమీషనింగ్ అత్యంత కీలకంగా మారింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతిని కాపాడటంతో పాటు, భారత సముద్ర ప్రయోజనాలను రక్షించడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది.

ఇలాంటి స్వదేశీ టెక్నాలజీతో మన దేశానికి కావాల్సిన వాటిని మనమే తయారు చేసుకుంటున్నాం. దీని ద్వారా భారత్ కీలక మార్పు కూడా చోటు చేసుకుంది. ప్రపంచంలో రక్షణ రంగంపై అత్యధికంగా ఖర్చు చేసే దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో వుంది. 2025 లో మన దేశం ఈ రంగంపై 92.1 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అమెరికా, చైనా, రష్యా, జర్మనీలు ఈ జాబితాలో కూడా వున్నాయి. స్టాక్ హోం అంతర్జాతీయ శాంతి పరిశోధక కేంద్రం ఓ నివేదికను విడుదల చేసింది. ★

---



బండ్లగూడ జాగీర్‌లోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ (SVIS) విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో అద్భుతమైన ప్రతిభను కనబరిచి, ఏకంగా ఆరు స్వర్ణ పతకాలను సాధించారు. ★

విజ్ఞానం

# జాతీయ ప్రసార దినోత్సవం
## (నేషనల్ బ్రాడ్ కాస్టింగ్ డే)

జూలై 23

✍ ఉపద్రష్ట లక్ష్మణసూరి



**నా**టినుండి నేటిదాకా పెద్ద చిన్న అందరి అత్యంత ఆత్మీయ నేస్తం జ్ఞాపకం వ్యాపకం రేడియో.. ప్రతి భారతీయుడి జీవితంతో పెనవేసుకుపోయిన జ్ఞాపకం రేడియో. రేడియో అంటే అంతులేని అపురూపమైన జ్ఞాపకాల సంపద. 1947 ఆగస్టు 15 భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన అర్ధరాత్రి ప్రధాని నెహ్రూ ప్రసంగం తర్వాత బాలాంత్రపు రజనీకాంతరావు రచించి స్వరపరిచిన మాది స్వతంత్ర దేశం ఎంతోమందిని భారతీయుల హృదయాలని దేశభక్తితో నింపింది. మహానటి సావిత్రి సమర్పించిన ప్రత్యేక ఉగాది కార్యక్రమం జనరంజని, మొక్కపాటి నవల బారిష్టర్ పార్వతీశం ఆధారంగా రూపొందిన నాటకం అత్యంత ప్రజాదరణ పొందాయి, శ్రోతలు కోరిన పాటల కార్యక్రమం జనరంజని అప్పటికి ఇప్పటికీ అత్యంత జనాదరణ పొందిన కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచిపోయింది .రేడియో కార్యక్రమాల్లో భాగంగా తొలి తెలుగు ప్రసంగం సజీవమైన తెలుగు అనే అంశంపై ప్రసంగం చేసిన గిడుగు రామ మూర్తి పంతులు 1938 జూన్ 18న 15 నిమిషాల ప్రసంగం గా నిలిచింది. తొలి తెలుగు నాటకం అనార్కలి, తొలి తెలుగు వ్యాఖ్యాతగా మల్లంపల్లి ఉమామహేశ్వరరావు, పిల్లల కార్యక్రమాలు ఇలా ఎన్నో కార్యక్రమాల ద్వారా రేడియో అందరి ఇంటిలో ఓ ముఖ్యమైన కుటుంబ సభ్యురాలుగా ప్రముఖ పాత్ర వహించింది.

ఎంతో విశిష్టంగా క్రమశిక్షణతో కూడి తెల్లవారుజామునే ప్రసారాలు ప్రారంభానికి ముందు శివరంజని రాగం ఆధారంగా యూదు సంగీత దర్శకుడు వాల్టర్ క్యాప్ మ్యాన్ స్వరపరిచిన మోహి మెహతా వయోలిన్ పై వాయించిన అత్యంత మధురమైన ఆల్ ఇండియా రేడియో సిగ్నేచర్ ట్యూన్ తో కొన్ని కోట్ల మంది భారతీయుల దినచర్య ప్రారంభమయ్యేది. ఇది ఆకాశవాణి కేంద్రం అనే అధికారిక ప్రకటనతో ప్రసారాలు ప్రారంభమయ్యేవి. కేయూరాణి న భూషయంతి అంటూ సంస్కృత శ్లోకంతో భక్తి రంజని కొన్ని కోట్ల మంది భారతీయుల మదిని భక్తి భావంతో నింపేది. 90 ఏళ్ల క్రితం ఆరంభమైన ఆకాశవాణి ప్రపంచ ప్రచార మాధ్యమాల్లో తనదైన ముద్రను వేసుకుంటూ ముందుకు సాగుతూనే ఉంది. ఒక రేడియో సిగ్నేచర్ ట్యూన్ఎంతోమంది హృదయాలపై ఎంతో ఘనమైన సంతకాన్ని చేసింది. వందేమాతరం అంటూ పొద్దున్నే నిద్ర లేపి భక్తి రంజని తో ప్రశాంత ఆధ్యాత్మికద్వారాలు తెరిచి హలంబట్టుకుని పొలానికి బయలుదేరే రైతు మెడలో శబ్దాల పుష్పాల మాలలు అలంకృతం చేస్తూ, మనం ఉన్న ప్రాంతం నుంచి విశ్వమంతా జరిగిన విశేషాలను తిప్పుకొచ్చే ప్రాంతీయ జాతీయ అంతర్జాతీయ వార్తలు, కరెంట్ అఫైర్స్ స్పాట్లైట్ వంటి ఆంగ్ల కార్యక్రమాలు వార్తా వ్యాఖ్యలు జిల్లా సమాచార లేఖలు ఎఫ్ఎం రెయిన్బో న్యూస్ బిలిటిల్లో ప్రత్యేక వార్తా కథనాలు ప్రతిరోజు నిత్య సత్యాలుగా శబ్ద సాక్ష్యాలుగా అందిస్తూ ఇప్పుడు న్యూస్ డివిజన్ గా సేవలందిస్తోంది. ఇంటర్నెట్, టీవీలు, ఇవేమీ లేని రోజుల్లో రేడియో ఒక్కటే వార్తలను

వినోదాన్ని అందించిన సాధనంగా ప్రజల మన్ననలను చూరగొన్నది. రోజు నాలుగు పూటలా పలు భాషల్లో వార్తలను ప్రసారం చేస్తూనే, పాటలు, జానపద గీతాలు, శాస్త్రీయ, లలిత సంగీతం, వ్యవసాయ, కార్యక్రమాలు క్విజ్ కథానిక సినిమా ఇలా అన్నింటిని సమపాళ్లలో ప్రసారం చేసిన రేడియో అప్పటి నుంచి ఇప్పటిదాకా ప్రజల మన్ననలను పొందుతూనే ఉంది.

నాటికలు, నాటకాలు, రూపకాలు ప్రత్యక్ష వ్యాఖ్యానాలు, ప్రత్యక్ష ప్రసారాలతో బాలబాలికలు , యువత, మహిళలు, కర్షకులు, కార్మికులు వయోధికులు ఇలా అన్ని వర్గాలకు రేడియో ఒక కుటుంబ నేస్తంగా అప్పటినుండి ఇప్పటిదాకా నిలిచిపోయింది దేశవ్యాప్తంగా వందలాది ఆకాశవాణి కేంద్రాలు వివిధ భాషల్లో వైవిధ్య భరితమైన కార్యక్రమాలతో అలరిస్తూనే ఉన్నాయి. వివిధ ప్రచారమాధ్యమాలు సామాజిక మాధ్యమాల జోరులో సైతం తనదైన శైలిలో 9 దశాబ్దాలుగా సాగుతున్న రేడియో నేడు మొబైల్ యాప్  న్యూస్ ఆన్ ఎయిర్ గా శ్రోతలను చేరుకుంటూనే ఉంది భాషను యాసను కాపాడుతూ సాహితీపిపాసన పెంచడంలో రేడియో ప్రభావవంతమైన సాధనంగా అలరారుతూనే ఉంది ప్రసార భారతి ఆర్కివ్స్ విభాగం మహనీయుల రికార్డింగ్‌లను భద్రపరిచి మనకు అందిస్తూనే ఉంది ప్రతి నెల చివరి ఆదివారం దేశంలోని అన్ని ఆకాశ వాణికేంద్రాలలో ప్రసారమయ్యే మన్ కీ బాత్ వినని వారు ఉండరు. మన భారతదేశ ప్రియతమ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ యావత్ దేశంలో మూల మూలలలో జరుగుతున్న నిర్మాణాత్మక కార్యక్రమాలను స్ఫూర్తిదాయకంగా ఉట్ట ంకిస్తూ యువతను, మహిళలను, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి దేశ సమగ్రతను బలోపేతం చేయడానికి ,మన దేశాన్ని ప్రపంచ వేదికలపై నిలపడానికి,  మన్ కీ బాత్. ప్రసంగమాలికల ద్వారా స్ఫూర్తిని అందిస్తున్నారు.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అందరికీ సులభంగా అందుబాటులో ఉండే ప్రసార సాధనాలలో రేడియో ముందుంటుంది. ఇంత ఘన చరిత్ర వహించిన ఈ రేడియో ప్రసారాలు ఎలా ప్రారంభమైంది. నాటి నుండి నేటి వరకు సమాచార ప్రసార రంగంలో రేడియో టెలివిజన్ సాధించిన అభివృద్ధిని దేశానికి ఇచ్చిన సేవలను గుర్తు చేసుకోవ డానికి నిర్దేశించిన అత్యంత ప్రముఖమైన దినోత్సవమేజాతీయ ప్రసార దినోత్సవం. నేషనల్ బ్రాడ్కాస్టింగ్ డే. భావవ్యక్తీకరణకు సమాచార పంపిణీకి సాహితీ సంగీతకళా వికాసానికి మానసిక ఉల్లాసానికి 90 ఏళ్లుగా మనిషికి మనిషికి మధ్య వారధిగా విశ్వసనీయతకు మారుపేరుగా ప్రసార భారతి పనిచేస్తోంది. బహుజనహితాయ బహుజన సుఖాయ బహుజనహితాయ ప్రతి ఒక్కరి సంక్షేమం ప్రతి ఒక్కరి జీవన సౌఖ్యం అనే నినాదంతో నిరంతరం కృషి చేస్తూ జ్ఞాన విజ్ఞాన వినోద ఆధ్యాత్మిక సమాచార ప్రసార వేదికగా ఆకాశవాణి నిత్య నూతనంగా వెలుగొందుతూనే ఉంది. ★

---



**శివరాంపల్లి:-** శ్రీ సరస్వతీ శిశు మందిర్-శివరాంపల్లి పాఠశాలలో శ్రీమతి రాజేశ్వరి గారు పదవీ విరమణ చేసిన సందర్భంగా, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో శ్రీ పతకమూరి శ్రీనివాసరావు 5 లక్షల రూపాయల గ్రాట్యుటీ చెక్కును అందజేశారు. ★

---

**సంపదలు గాని, పేరు ప్రతిష్ఠలు గాని, గౌరవ మర్యాదలు గాని, పాండిత్యము గాని పనిచేయవు. ప్రేమ ఒక్కటే నిలిచివుంటుంది.**

**- స్వామి వివేకానంద**

# వినాయక చవితి



- కోట లక్ష్మీఅన్నపూర్ణ



**గ**ణానాం త్వా గణపతిగ్ం హవామహే అనీ, శ్రీగణనాథం భజామ్యహం అనీ, శ్రీగణనాధసింధూరవర్ణ అనీ, తొండమునేక దంతము అనీ, తొలుత నవిఘ్నమస్తనుచు ధూర్జటినందన అని, ఏ పని మొదలు పెట్టినా గణపతి స్మరణతోనే ప్రారంభించడం మన ఆచారం, శుభకార్యాలు, సంగీతం, విద్య, నిత్య పూజలు మొదలుకొని ఏ పుణ్య కార్యమైనా గణపతిని తలచుకోవడంతోనే మొదలవు తుంది. ఏదైనా పూజచేసేటప్పుడు కూడా పసుపు గణపతిని పూజించి ఉద్వాసన చెప్పిన తరువాతనే పూజను మొదలుపెడతారు. ఎందుకంటే గణపతి విఘ్నాలను నివారిస్తాడు కాబట్టి. ఎటువంటి అంతరాయాలు రాకుండా ఉండాలంటే సజావుగా సాగిపోవాలంటే విఘ్నాలు రాకూడదు. ఆపదలు, ప్రమాదాలు వాటిల్లబోయే సంఘటనలు నివారించ బడాలన్నా కూడా వినాయకుని అనుగ్రహం ఉండాలి.

భాద్రపద శుద్ధ చవితి వినాయక చవితి. పార్వతీదేవి ముఖమనే పద్మాన్ని వికసింపజేసిన సూర్యుని వంటి వినాయకుడిని **"అగజానన పద్మార్కం గజానన మహర్నిశం అనేక దంతం భక్తానాం ఏకదంత ముపాస్మహే"** అని స్తుతిస్తే ఎంతో సంతోషమట. గణపతికి సంతోషం కలిగితే అమ్మవారికి ఆనందమే. అమ్మ చేతి పసుపు ముద్ద అందమైన రూపాన్ని సంతరించుకున్న రూపం గణపతి. అభ్యంగన స్నానానికి సిద్ధపడిన పార్వతీదేవి నలుగుపిండితో గణపతిగా మలచి వాకిలిదగ్గర కాపు ఉంచింది. లోనికి రాబోతున్న శివుడిని అడ్డగించడంతో శివుడు గణపతి శిరస్సును ఖండించాడు, తరువాత విషయం తెలుసుకుని గజాసురుని శిరస్సును అతికించి ప్రాణమయంగా గజాననుడయ్యాడు. శివుడికీ, శక్తికి ప్రతీక గణపతి, గణపతి ఆరాధనతో సిద్ధి, బుద్ధులు సంప్రాప్తిస్తాయి. సకల విద్యా అధిపూజితుడైన గణపయ్య మహాభారత లేఖకుడు.

దేవతలంతా ఒకసారి శివుని దగ్గరవు వచ్చి విఘ్నములకు ఒక్క అధిపతిని తమకు ఇమ్మని కోరారు. జ్యేష్ఠుడైననప్పటికీ మరుగుజ్జు రూపంలో ఉన్న గణపతి అనర్హుడని, తనకు ఆధిపత్యాన్ని ఇమ్మని కుమారస్వామి కోరుకొన్నాడు. గణపతి తన అశక్తత తెలిసినవాడు కాబట్టి తండ్రితో **"ఈపని నాకు సాధ్యము కాదుకదా తండ్రీ !"** అని వేడుకున్నాడు. అప్పుడు శివుడు ఒక్కసారి నారాయణ మంత్రాన్ని జపించినంత మాత్రాన అటువంటి శక్తి సమకూరుతుందని అన్నాడు. వినాయకుడు తల్లిదండ్రులకు ప్రదక్షిణ చేసి శివుడు చెప్పిన విధంగా చేశాడు. ఫలితంగా మూడుకోట్ల యాభైలక్షల నదుల్లో స్నానం చేసి వస్తున్న కుమారస్వామికి గణపతి కనిపిస్తూ వచ్చి చివరికి కైలాసంలో కూడా ముందుగానే కనిపించాడు. అప్పుడు కుమారస్వామి ఆధిపత్యాన్ని గణపతికే ఇవ్వమని ప్రార్థించాడు. ఆవిధంగా గణపతి విఘ్నేశ్వరుడైనాడు. ఆరోజు వినాయకచవితి, జనులంతా భక్తితో సమర్పించిన కుడుములను, పిండివంటలను, ఉండ్రాళ్లను స్వీకరించిన గణపతి తల్లి దండ్రులకు నమస్కరించడానికి ప్రయత్నిస్తూ శ్రమపడుతూ

ఉండడాన్ని చూసిన చంద్రుడు నవ్వాడు. అప్పుడు గణపతి ఉదరము పగిలి అందులో కుడుములు మొదలైనవన్నీ బయటకు వచ్చాయి. ఇది చూసి పార్వతీదేవి ఆగ్రహముతో చంద్రుడుని చూడరాదని శపించెను. మహర్షులంతా ప్రార్థించిన తరువాత ఒక భాద్రపదశుద్ధ చవితి నాడు మాత్రం చంద్రుని చూడరాదని, యధావిధిగా పూజచేసుకుని కథ చదివి అక్షింతలు వేసుకుంటే ఎటువంటి ప్రభావం ఉండదనీ తెలిపింది. వినాయకచవితినాడు ఒక ఆసనము పైన వినాయకుడిని ఉంచి పైన పాలవెల్లితో అలంకరించి కుడుములు, అపూర్వములైన పిండివంటలు, పూలు పండ్లు సమర్పించి పూజించాలి. ఇక్కడ రక రకాల ఆకులను, పత్రాలను సమర్పించడంలోని ఆంతర్యం ఏమిటంటే మనస్సు అనే దళాన్ని భక్తితో సమర్పించడమే. ఇంకా వాటిలో ఉండే ఔషధగుణాలు మనం పొందడంతో పాటు వాటిని గురించిన అవగాహన కూడా పెరుగుతుంది.

వినాయకచవితి పండుగ పిల్లలకు ఎంతో ఉత్సాహాన్నిచ్చే పండుగ. గుంజీలు తీయడం, పూజలు చేయడం ఆనందోత్సాహాలతో చేస్తారు. అందుకే వీధుల్లోను, కూడళ్లలోను పెద్దమండపాలు ఏర్పాటు చేసి పూజిస్తారు. సామూహికంగా పూజలు చేయడంవల్ల సామరస్యం పెరుగుతుంది. వినాయకుడిని చూసేందుకు ఇళ్లకు తిరగడంలో పోటీపడుతారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేయడం వల్ల కళలకు ప్రోత్సాహం లభిస్తుంది. స్వాతంత్ర్య సాధనలో వినాయక చవితి ఉత్సవాలు ప్రధాన సాధనమైనాయి.

గణపతి నవరాత్రులను తొమ్మిది రోజులు నిర్వహించడం ఒక పద్ధతి. అయితే మూడు, ఐదు, తొమ్మిది, పదకొండు ఇలా ఎవరి వీలుప్రకారం వారు చేయడం పరిపాటి. అనంత పద్మనాభ చతుర్దశితో ఈ వేడుకలు పూర్తవుతాయి. చివరిరోజు వినాయకుడిని తమకు దగ్గరలో ఉన్న చెఱువులలో నిమజ్జనం చేస్తారు. మట్టితో తయారుచేసి విగ్రహాలను పూజించడానికి ప్రాధాన్యమీయాలి. అందువల్ల పర్యావరణం పరిరక్షించబడుతుంది. శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యానికి దూరంగా ఆధ్యాత్మిక వాతావరణంలో వినాయకచవితి ఉత్సవాలను జరుపుకోవాలి. వినాయక చవితి పండుగ అందరిలోను భక్తి ప్రపత్తులను, ఆనందాన్ని, పెంపొందించే పండుగ. ★



కర్నూల్ :- శ్రీ సరస్వతీ శిశుమందిర్ కర్నూల్ పాఠశాలలో శ్రీవరలక్ష్మీ వ్రతం ★



**శ్రీశారదాధామము :-** శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం శ్రీశారదాధామములో శ్రీవరలక్ష్మీ వ్రతం ★



**సిద్ధిపేట :-** శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో గణిత విజ్ఞానమేళాలో ప్రదర్శనలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు. ★

పద్యం-పరమార్థం


# సుభాషితాలు చదవాలి!



ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి

వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలు, పురాణాలు, కావ్య ప్రబంధాలన్నీ మానవ జీవిత వికాసానికే ఆవిర్భవించాయి. వ్యాస – వాల్మీకుల వలే మహా పురాణాలు – కావ్యాలు మనకందించుకున్నా సుభాషితాలెన్నో రచించి నీతి – వైరాగ్య – భక్తి మార్గాలు చూపించిన పండిత శాస్త్రకవి భర్తృహరి. ఆయన రచనలను 'సుభాషిత రత్నావళి' పేరిట అనువాద సంవిధానంతో తెలుగు పద్యాలలో మనకందించిన మహానుభావుడు ఏనుగు లక్ష్మణకవి.

"బ్రతికినన్నాళ్లు నీ భజన చేయునుగాని మరణకాలము నందు మరచునేమో'' ... అని నరసింహశతకకర్త శేషప్ప అంటాడు. అసలు మానవుని ఆయువు ఎన్నాళ్లు? 'శతమానంభవతి' కదా! నూరేళ్లు. ఈ నూరేళ్లలో ఎంతకాలం ఎలా గడిచి పోతుంది! ఆలోచించాల్సిందే! అలా ఆలోచించి చెప్పిన భర్తృహరి శ్లోకాన్ని ఏవిధంగా (తెలుగు పద్యంలో) ఏనుగు లక్ష్మణకవి మనకందిస్తున్నారో చూడండి!



భర్తృహరి

ఉ॥ **"ఆయువు నూరు వత్సరము**
**లందు సగంబు నశించె నిద్రచే,**
**నాయరలో సగంబుగత**
**మయ్యెను బాల్యజరాప్రసక్తిచే,**
**పాయక దక్కినట్టి సగ**
**బాలు గతించు ప్రయాసవృత్తిచే,**
**నాయువు చంచలం బగుడు**
**ప్రాణుల కెట్లు సుఖంబు చేకూరున్.**

ఆయువంటే జీవిత కాలాన్ని నిలిపే ప్రాణము. ప్రపంచంలోని సర్వజీవరాశులన్నింటికి ఇంత అని హద్దొకటి ఉంటుంది. మానవుల జీవనం నూరు సంవత్సరాలని ఒక హద్దుంది. ఆయితే 120 వరకు బ్రతికిన వారూ ఉన్నారు. శరదశ్శతమ్ అని, శతమానం అని, నూరేళ్లు సల్లగా బతుకు నాయనా... అని, అయ్యో! నూరేళ్లు నిండినై అని... ఇలా దీవెనలూ – వేదనలూ వినిపిస్తుంటాయి. మరి పద్యంలో ఏముందో చూద్దాం!

"ఈ జీవితం నూరేళ్లు; అందులో నిద్రకు సగం పోయింది. ఇక మిగిలిందెంత ఏభై. ఆ ఏభైలో బాల్యానికి–వృద్ధాప్యానికి సగం అంటే ఇరవై అయిదు పోయింది. ఇక మిగిలింది ఇరవై అయిదు. ఈ ఇరవై అయిదు కష్టాలతో గడిచిపోతుంది – ఇంత చంచలమైనది ఈ ఆయుష్షు. ఇక ఈ ప్రాణులకు (మానవులకు) సుఖాలెట్లా కలుగుతాయి."

సరిగా ఇదే అంశం మహాభాగవతంలోని ప్రహ్లాద చరిత్రలో ఉంది. ఓ శ్రీహరీ! హరీ! అంటున్న కొడుకును చూచి హిరణ్య కశిపుడు చండామార్క గురువులను పిలిపించి, ఆయిదేళ్ళ ఈ బాలుణ్ణి చదివించండి అని అప్పగిస్తాడు.

చండామార్కులు (శుక్రాచార్యులవారి పుత్రులు) ప్రహ్లాదుణ్ణి తీసుకొని వెళ్లి, మిగతా రాక్షస బాలురతో కలిపి

చదువు చెబుతుంటారు. గురువులు లేని సమయంలో ఆ బాలుర నందరినీ ఒకదగ్గర కూర్చోబెట్టుకొని ప్రహ్లాదుడు ఇలా బోధిస్తాడు.

మనం నూరేళ్లు బతుకుతాం. అందులో ఏభైయేళ్లు నిద్రకు పోతుంది. మిగతా ఏభైలో పదిహేనేళ్లు బాల్యానికి పోతుంది, మరో పదిహేనేళ్లు వృద్ధాప్యానికి పోతుంది. ఇక మిగిలింది ఇరవై యేళ్లు. ఈ ఇరవై యేళ్లు సుఖాలు–భోగాలు పొందడానికి మనిషి తాపత్రయ పడతాడు. ఈ మిగిలిన సంవత్సరాలలోనే మనం భగవంతుణ్ణి (శ్రీహరిని) స్మరిస్తూ – భజిస్తూ జీవితాన్ని సార్థకం చేసుకోవాలి అని చెప్పి అందరినీ శ్రీహరి నామ జపంలో పాల్గొనేట్టు చేస్తాడు. ఇది చూచి గురువులు ప్రహ్లాదుణి, తండ్రికప్పగిస్తూ, పిల్లలందరినీ హరి భక్తులుగా చేస్తున్నాడని... చెబుతారు. హిరణ్యకశిపుడు ఆగ్రహోదగ్రుడై ప్రహ్లాదుణ్ణి అనేక విధాలుగా హింసింప జేస్తాడు.

ఐతే భర్తృహరి ప్రకారంగా ఆయువు నిలకడ లేనిదనీ, అందువల్లనే ప్రాణులకు సుఖంలేదనీ చెప్పినట్లు మనం భావించాల్సి వస్తుంది. నిద్ర, బాల్యం, వృద్ధాప్యం పోగా మిగిలిన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రహించాలి. ఈ విషయంలో శ్రీకాళహస్తీశ్వర శతకకారుని సందేశాన్ని మనం గ్రహించాల్సి ఉంది. “దంతంబులు పడినప్పుడే....” అన్న పద్యంలో ఈ విషయాన్ని వారు తెలియజేశారు.

దంతాలు ఊడిపోనప్పుడే, శరీరంలో శక్తి ఉన్నప్పుడే, శరీరంలో నొప్పులు కలుగనప్పుడే, వెంట్రుకలు తెల్ల బడనప్పుడే, వృద్ధాప్యం శరీరాన్ని ఆక్రమించనప్పుడే ..... ఓ దేవుడా! అని ఆయుష్షును గూర్చి స్మరించాలి, జపించాలి, తరించాలి, పాద పద్మాల్ని ధ్యానించాలి అన్నాడు కవి.

అవును! ఇవాళ ఎవరైనా గ్రహించవలసిందిదే! దైవభక్తి అయినా దేశభక్తి అయినా శరీరంలో శక్తి ఉన్నప్పుడే అని గ్రహించి వ్యవహరించాలి.

ఇంతకూ ఆయుష్షు శాశ్వతం కాదనీ అంటే చిరకాలముండేది కాదని గ్రహించాలి. ఉన్న ఆ కాలంలోనే మంచి పనులు చేయాలని తెలుసుకోవాలి. తెలుసుకోవడం కాదు ఆచరించాలని భావించి ఆచరించి చూపించాలి. ఇది అలనాటి మహా పండితుడు భట్టి – విక్రమార్క – వరరుచి తదితరుల సోదరుడైన భర్తృహరి యొక్క అభిప్రాయంగా భావించాలి. ఇది ఆ మహా పండితుని నీతిబోధలలో అంతర్భాగంగానే గుర్తించాలి. ★



**రామాయణం పేట :–** శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల నూతన భవన నిర్మాణానికి సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. రామాయంపేట అశోక్ సింఘాల్ శిశు మందిర్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి గారు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాస రావు గారు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి శ్రీమతి అనఘా వేంకట లక్ష్మీ గారు, పాఠశాల ప్రధానాచార్యులు శ్రీమతి కవిత గారు, పాఠశాల పూర్వ విద్యార్థులు, కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు నూతన పాఠశాల భవన నిర్మాణం కోసం 60 లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఇక ముందు కూడా మరింత మంది పూర్వ విద్యార్థులను సంప్రదించి, పాఠశాల భవన నిర్మాణానికి అవసరమయ్యే నిధులను సేకరిస్తామని పూర్వ విద్యార్థులు ప్రకటించారు.

విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర రెడ్డి గారు మాట్లాడుతూ శ్రీ సరస్వతీ శిశుమందిరాల అభ్యున్నతి కోసం పూర్వ విద్యార్థులు , హితైషులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ★

# రాజకీయ రంగంలో భారతీయ చింతనను
# అన్వయం చేసిన ఆధునిక ఋషి దీనదయాళ్



దీన్‌దయాళ్ జీ
జయంతి. సెప్టెంబర్ 25

✍ - అన్నావజ్ఝల శ్రీనాథరావు

**దీ**నదయాళ్ ఉపాధ్యాయ... ఓ కర్మ యోగి. నిజానికి రాజకీయ రంగంలో వున్న వారికి కర్మయోగి అన్న పదం వాడరు. కానీ.. దీనదయాళ్ ఉపాధ్యాయ ఇందుకు పూర్తి అర్హులు. ఏ రంగంలో అయినా, ఏ పని అయినా చిత్త శుద్ధితో, అంకిత భావంతో చేయడాన్నే కర్మ యోగం అంటాం. అది కూడా ఓ తపస్సే. ఈ తపస్సునే ఆజన్మాంతం చేసిన ఆధునిక ఋషి.

ఆయన కేవలం మాటల మనిషి కాదు, చెప్పినది తాను ఆచరించి చూపే స్వయంసేవకుడు, కార్యనిర్వాహకుడు, సామాజిక చింతకుడు, ఆర్థికవేత్త, విద్యావేత్త, రాజకీయవేత్త, రచయిత, పాత్రికేయులు , వక్త. పండిత దీన్‌దయాళ్ జీవితం పరోపకార ధర్మపు ఆచరణ, సనాతన సంప్రదాయం, భారతీయ సాంస్కృతిక విలువలకు ప్రతిబింబం. ప్రజాస్వామ్యపు ప్రాథమిక సిద్ధాంతాలు పెట్టుబడిదారీ విధానానికి ప్రతిచర్య అని అభిప్రాయపడ్డారు. కనుక వేదాలు, పురాణాలు, ధర్మ శాస్త్రాలు ఇతర సాంస్కృతిక జ్ఞాన వ్యవస్థల నుండి జాతీయవాద నైపుణ్యాన్ని భారతీయ సూత్రాలను అనుసరించాలని ఆయన సూచించారు. ఆధునిక భారత రాజకీయాలను మానవత్వం అనే పునాదిపై నిలబెట్టడానికి ప్రేరేపించిన అసాధారణ వ్యక్తులలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఒకరు. అంతేకాకుండా, ఉపాధ్యాయ్ మరణానంతరం కూడా ఆయన అనుచరులు, ప్రత్యర్థులు ఆయన గొప్పతనాన్ని కొనియాడుతున్నారు. ఆయన ప్రతిపాదించిన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మౌలిక విలువలు నేటికీ కూడా మన దేశానికి మార్గదర్శిగా నిలుస్తున్నాయి.

రాజకీయాల్లో భారతీయ విలువలకు ఆయన ఒక ఆదర్శ ప్రతినిధి. స్వాతంత్ర్యం తరువాత రాజకీయ శూన్యత తొలగించాల్సిన అవసరాన్ని గుర్తించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ద్వితీయ సర్ సంఘచాలక్ గురూజీ గోళ్వాల్కర్ ఆ బాధ్యతను దీనదయాళ్ జీ కి అప్పగించారు. జాతీయవాద రాజకీయ పార్టీ అయిన భారతీయ జన సంఘ్, 1951 లో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రారంభించినప్పుడు సంస్థాగత నిర్మాణం కోసం దీనదయాళ్ గారినే నియమించారు.

### నిరంతర అధ్యయన శీలి...

దీనదయాళ్‌జీ పుస్తకాలు బాగా చదివేవారు. నిరంతర కార్యభారం వల్ల నిర్విరామంగా పని చేస్తున్నా, అనేక కొత్త పుస్తకాలు చదివేవారు. చదువుకోవడానికి ఎక్కువ సమయం దొరుకుతుందని ప్యాసింజరు బండ్లలో ప్రయాణం చేసేవారు. విద్యార్థి దశలో ఆయన ఎన్నడూ ఆర్థిక శాస్త్రం చదవలేదు. కాని ఆర్థిక శాస్త్ర విజ్ఞానం అవసరం అని భావించాక, కొద్ది రోజుల్లోనే అధ్యయనం ప్రారంభించేశారు. పెట్టుబడిదారీ విధానం, లేదా సామ్యవాదం మినహా ప్రపంచానికి మరో దారిలేదు అని అందరూ తీర్మానించుకున్న దశలో దీనదయాళ్‌జీ మరో మార్గాన్ని చూపెట్టారు. కలకత్తాలో జాతీయ గ్రంథాలయంలో కూర్చుని నలభై రోజుల పాటు ఒక తపస్సులా తరచు భోజనం సంగతి కూడా మర్చిపోయి అత్యంత జటిలమైన ఆర్థిక శాస్త్ర గ్రంథాలను ఆయన అధ్యయనం చేశారు. ఆర్థిక శాస్త్రం గురించి అపారమైన అధ్యయనం చేసిన ఫలితంగానే ఆయన పాశ్చాత్యుల పెట్టుబడిదారీ విధానం, కారల్ మార్క్స్ ప్రవచించిన సామ్యవాదం అనే రెండు సిద్ధాంతాలకు భిన్నంగా భారతీయమైన 'ఏకాత్మ మానవ దర్శనం' అనే నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దాన్నే భారతీయ జనతా పార్టీ తన మౌలిక సిద్ధాతంగా స్వీకరించింది.

మనిషి అత్యంత సాధారణం.. అపారమైన విజ్ఞానం.. ఒకసారి విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ల గోష్ఠి కార్యక్రమానికి

దీనదయాళ్‌జీని ఆహ్వానించారు. పెద్ద పెద్ద ప్రొఫెసర్లు వస్తారు కదా అని ఈయన కోటు, బూటు, సూటు వేసుకుని పోలేదు. మామూలుగా ధరించే నూలు బట్టలు ధోవతి, చొక్కాతోనే వెళ్ళారు. ఆ రోజు జరిగిన చర్చలో దీనదయాళ్‌జీ తమ ప్రసంగంలో విదేశాలలో ముద్రితమైన పుస్తకాల్లోని కొత్త విషయాలను ప్రస్తావించారు. ఆ పుస్తకాలలో కొన్ని ఇంకా ఇక్కడి విశ్వ విద్యాలయాల గ్రంథాలయాలలోకి రాలేదు. ఆయన ఉదహరించిన కొన్ని పుస్తకాలను ఆ సమావేశంలో పాల్గొన్న ప్రాచార్యులెవరూ చూసి ఉండలేదు. అంతటి తాజా సమాచారం ఆయన ఎలా అందించగలిగారా అందరికీ ఆశ్చర్యం వేసింది. ఆ చర్చ ముగియగానే, వెంటనే ధన్యవాదాలు తెలియజేస్తూ ఒక ప్రాచార్యుడు చేసిన వ్యాఖ్య చాలా ముఖ్యమైనది. 'దీనదయాళ్‌జీ గురించి సాధారణ విషయం ఏదైనా ఉందా అంటే అది ఆయన వేషం. దాన్ని ప్రక్కన పెడితే ఆయన గురువులకు గురువు' అన్నారా ప్రొఫెసర్.

ఓ ప్రముఖ రాజకీయ వేత్త అయినప్పటికీ అయన తన ఆలోచనలను రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా వ్యక్తీకరించేవారు. సామాన్య ప్రజలకు మెరుగైన జీవనం ఏ విధంగా కల్పించాలి అని ఆరాటపడుతూ ఉండేవారు. దీని కోసం "అంత్యోదయ" అన్న సిద్ధాంతాన్ని తీసుకొచ్చారు. అంటే.. సమాజంలోని చివరి వ్యక్తిని ఉద్ధరించాలన్న దృక్పథాన్ని, లక్ష్యాన్ని ప్రజల ముందు వుంచడం. ప్రతిపాదించిన 'అంత్యోదయ' తత్వం, అంటే మొదటగా చిట్టచివర ఉన్న వ్యక్తి వికాసం కోసం కృషి చేయడం, సమాజంలోని అణగారిన వర్గాల అవసరాలను పరిష్కరించడంపై కేంద్రీకృతమై ఉంది.

"భారతీయ జీవనంలో, 'అంత్యోదయ' అంటే సమాజంలోని చివరి వ్యక్తి ఎదుగుదల, అభివృద్ధిని మనం నిర్ధారించాలి." స్వావలంబన, వికేంద్రీకరణ, సామాజిక న్యాయకృషికి సూత్రాలకు అనుగుణంగా ఉండే విధానాలను రూపొందించడంలో ఆయన విస్తృతంగా కృషిచేశారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యక్తి, సామూహిక శ్రేయస్సుల మధ్య సమతుల్య విధానాన్ని సూచించింది.

దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన -ఏకాత్మ మానవతావాదం' కేవలం రాజకీయ వ్యవస్థలకు ప్రత్యామ్నాయ నమూనా మాత్రమే కాదు, మానవ జీవితంలోని ప్రతి అంశాన్ని సమతుల్యం చేయడానికి ప్రయత్నించే సమగ్ర ఆలోచనా విధానం. ఆయన అభిప్రాయాల ప్రకారం వ్యక్తి, సమాజం, దేశం మధ్య పరస్పర అనుసంధానాన్ని ఈ సమగ్ర విధానం వివరిస్తుంది. నేటి సందర్భంలో, ప్రాథమిక హక్కులలో జీవితం, స్వేచ్ఛ, సమానత్వం, విద్య, ఆరోగ్యం ఉంటాయి. దీనదయాళ్ దృష్టిలో, ఆరోగ్యం అనేది కేవలం వ్యక్తిగత శ్రేయస్సుకు సంబంధించిన విషయం కాదు.

అభివృద్ధి చెందిన సమాజం, దేశానికి కీలకమైన అంశం. ఆరోగ్య హక్కు ప్రాథమికంగా ఒక వ్యక్తి, సమాజం మధ్య సంబంధంతో ముడిపడి ఉందని, సామూహిక సంక్షేమం సందర్భంలో చూసినప్పుడు మాత్రమే అది పూర్తిగా గ్రహించబడుతుందని ఆయన విశ్వసించారు.

**ఏకాత్మ మానవ దర్శనం..**

"ఆత్మవత్ సర్వ భూతేషు" అన్నది గీతా వాక్యం. అందరిలోనూ వున్నది ఒకే ఆత్మ వస్తువు అని. దీనిని రాజకీయ రంగంలోకి అన్వయం చేస్తూ "ఏకాత్మ మానవ దర్శనం" అన్న సిద్ధాంతాన్ని రూపొందిచారు దీనదయాళ్. ఏకాత్మ మానవ దర్శనం అంటే...వ్యక్తిది కానీ, సమాజానిది కానీ అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక అభివృద్ధి మాత్రమే కాదని, మనిషి సంపూర్ణ వికాసమే నిజమైన అభివృద్ధి అని చెప్పారు. ప్రతి వ్యక్తినీ అభివృద్ధి వైపు, సమృద్ధి వైపు, సంతోషం వైపు తీసుకువెళ్లగల ఉత్తమ సిద్ధాంతం 'ఏకాత్మ మానవ వాదం'.

మనిషి అంటే కేవలం శరీరం మాత్రమే కాదు, శరీరంతోపాటు మనసు-బుద్ధి-ఆత్మ ఈ నాలుగింటి సమాహారమే మనిషి. కూడు, గుడ్డ, గూడు లభించినంత మాత్రాన సుఖం పొందలేము. మనసు, బుద్ధి, ఆత్మల అవసరాలు కూడా నెరవేరినపుడే మనిషి ఆనందంగా

(తరువాయి భాగం 28వ పుటలో...)

# వివిధ పాఠశాలల్లో పదవీ విరమణ పొందిన ఆచార్యులు



ఆదిలాబాద్ శైక్షణిక ప్రముఖ్
వేణుమాధవ్ గారు



ఆసిఫాబాద్ పాఠశాల ఆచార్య
శ్రీరాంసత్యనారాయణ గారు




కార్వాన్ పాఠశాల ఆచార్య
తంగెళ్ళపల్లి రమేశ్ గారు



పామిడి పాఠశాల ఆచార్య
శ్రీమతి సంధ్యావందనం తులసీబాయి గారు



ఆదిలాబాద్ : స్థానిక ఓల్డ్ హౌజింగ్ బోర్డులో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న సీబీఎస్ ఈ పాఠశాలకు శ్రీ సరస్వతీ శిశు మందిర్ పూర్వ విద్యార్థి, బీజేపీ సీనియర్ నేత సుహాసిని రెడ్డి లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర రెడ్డికి ఈ చెక్కును అందజేశారు. తాను శిశు మందిర్ లో చదువుకొనే, ఇంత స్థాయిలో వున్నానని, తాను జీవితంలో ఎదగడానికి సరస్వతీ శిశు మందిర్ ఎంతో ఉపకరించిందన్నారు. ఆదిలాబాద్ కేంద్రంలో



**అమరాపురం:–** శ్రీ సరస్వతి విద్యాపీఠం అనంతపురం సమితి అధ్యక్షులు శ్రీ గోపాలకృష్ణ గారి సహకారంతో శ్రీ సరస్వతీ విద్యా మందిరం అమరాపురం కేంద్రంగా చిన్నారులకు వాసవి ట్రస్ట్ వారిచే నోటుపుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. ★

---

సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో సీబీఎస్ఈ పాఠశాల రావడం ఎంతో ఆనందంగా వుందని హర్షం వ్యక్తం చేశారు. ★

# స్వాతంత్ర్య దినోత్సవ దృశ్యమాలిక



ప్రాంత కార్యాలయము-శ్రీశారదాధామము



కల్వకుర్తి



అమరాపురం



తిరంగా ర్యాలీ
రామాలయం-నారాయణపేట



శంషాబాద్



కులబ్‌గూర్-సంగారెడ్డి



చాగలమర్రి



పోసానిపేట



కళ్యాణదుర్గం



సదాశివపేట




సంగారెడ్డి

# స్వాతంత్ర్య దినోత్సవ దృశ్యమాలిక



పెద్దపల్లి



శ్రీనివాసనగర్



పాల్వంచ



ద్వారకానగర్



స్విస్



నల్గొండ



గద్వాల్



శివరాంపల్లి



సూర్యాపేట



కుషాయిగూడ



శంషాబాద్



కార్వాన్




బడంగ్‌పేట

# వరలక్ష్మీ వ్రత మహోత్సవ దృశ్యమాలిక



అలియాబాద్-భాగ్యనగర్



భైంసా - నిర్మల్




ధూల్‌పేట



హుస్నాబాద్



కమ్మరపల్లి



ముధోల్



నార్సింగి



సిద్ధిపేట



ఆళ్ళగడ్డ

# శిశుమందిర్ బాలలు గీసిన చిత్రాలు



జి.కావేరి–9వ తరగతి–కె.డి.ఆర్.నగర్



యం.నిహాల్ –5వ తరగతి–సిరిసిల్లా




యన్.విక్రమ్ –6వ తరగతి–పరిగి



విఘ్నేష్ –4వ తరగతి–గద్వాల్



పి.ప్రవీణ్ కుమార్ –7వ తరగతి–కోరుట్ల



యం. భీమశంకర్–3వ తరగతి – కేశవనగర్

జి.కె.

# లోక జ్ఞానము - 214



అయాచితుల లక్ష్మణరావు

## ఆగస్టు 2026 "స్ఫూర్తి" ఆధారంగా

1. చాంద్రమాన వర్షకాలం ఏ రోజునుండి ప్రారంభమవుతుంది?
2. ప్రపంచంలో అత్యధిక యూరియం నిల్వలు ఉన్న దేశమేది?
3. శ్రీ ధర్మపురి నరసింహ శతక కర్త పేరేమి?

### ధర్మం - సంస్కృతి

4. శ్రీరాముడు ఏ యుగానికి చెందినవాడు?
5. వాల్మీకి మహర్షికి రామాయణ గాథను ఎవరు వివరించారు?
6. త్రిమూర్తులలో 'స్థితికారకుడు' ఎవరు?

### గణిత - వైజ్ఞానిక అంశములు

7. ఒక త్రిభుజంలోని మూడు కోణాల మొత్తం ఎంత?
8. 225 యొక్క వర్గమూలం ఎంత?
9. వృత్త వైశాల్య సూత్రం ఏది?

### సామాజిక శాస్త్రాలు

10. హిమాలయాలు భారతదేశానికి ఏ వైపున ఉన్నాయి?
11. థార్ ఎడారి ఉన్న రాష్ట్రం ఏది?
12. నీతి ఆయోగ్ (NITI-Ayog) ఎప్పుడు అమలుల్లోకి వచ్చింది?

### సమకాలీన అంశాలు

13. భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
14. ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి ఎవరు?
15. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్ష రద్దుచేయడానికి ఒప్పుకొన్న రాష్ట్రం ఏది?

## లోక జ్ఞానము -213 సమాధానములు

1. బాలగంగాధర తిలక్
2. సురవరం ప్రతాపరెడ్డి
3. కృష్ణద్వైపాయనుడు
4. ప్రచేత
5. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు
6. దితి
7. $\frac{22}{7}$ లేదా 3.1415...
8. $360^0$ డిగ్రీలు
9. హైడ్రోజన్
10. $82\frac{1}{2}^0$ డిగ్రీల తూ.రే.
11. కేరళ
12. ఉత్తరప్రదేశ్
13. Special Intensive Revision
14. ఆంధ్రప్రదేశ్
15. ఇరాన్

## 145 జతపరచుము సమాధానాలు

| | | |
|---|---|---|
| 1 | ప. | అల్లసాని పెద్దన |
| 2 | త. | విశ్వనాథ సత్యనారాయణ |
| 3 | క. | బద్దెన |
| 4 | చ. | బమ్మెర పోతన |
| 5 | ట. | ఉన్నవ లక్ష్మీనారాయణ |

## 146- జతపరచుము

| | | |
|---|---|---|
| 1. కార్తికేయుడు | ( ) | క. అర్జునుడు |
| 2. అభిమన్యుడు | ( ) | చ. శ్రీరాముడు |
| 3. ధ్రువుడు | ( ) | ట. శివుడు |
| 4. లవకుశులు | ( ) | త. ధృతరాష్ట్రుడు |
| 5. దుర్యోధనుడు | ( ) | ప. ఉత్తానపాదుడు |

విద్యార్థులు గానీ,
ఆచార్యులు గానీ మీ సమాధానాలను వ్రాసి స్ఫూర్తి విభాగానికి తపాల / కొరియర్ ద్వారా పంపగలరు.
(లేదా)
sphoortissvp@gmail.com కి మెయిల్ ద్వారా పంపగలరు.

పోషకుల పేజి

# బడికి వేళైంది..... పిల్లలు లేవరేమిటీ?



✍ - లింగం సుధాకర్ రెడ్డి

**ఆ**డుతూ, పాడుతూ బడికి వెళ్లాల్సిన పిల్లలు భారంగా వెళ్తున్నారు. తమ పిల్లలకు మంచి బడి కావాలని ఎంత దూరమైనా పంపిస్తున్నారు. బస్సులు ఎలాగూ ఉన్నాయి కదా! కానీ ఆ బస్సు లోపల పిల్లలను ఎక్కించుకుని వెళ్తూ సమయానికి బడికి చేరుకోవాలని, ఈ కారణంగా కొందరు పిల్లలు 6 - 6.30 గంటలకే బస్సు ఎక్కాల్సి వస్తున్నది. ఈ లోగా పిల్లల్ని తయారు చేయాలంటే వారు ఎప్పుడు లేవాలి ? దాని కొరకు తల్లిదండ్రులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. అంత ఉదయమే వాళ్లు లేవడానికి నానాయాతన పడాల్సి వస్తున్నది. అంతే కాదు పిల్లలు కూడా తరగతి గదుల్లో నిద్ర పోతున్నారు.

ఇలా కాకుండా ఉండాలంటే పిల్లల విషయంలో తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలుపుతూ ఈనాడు పత్రికలో డా॥ వంగీపురం శ్రీనాథాచారి గారు వ్రాసిన "ఇంకో 5 నిమిషాలమ్మా .... ప్లీజ్!" అంటూ వచ్చింది. అందులోని కొన్ని విషయాలను మీకు తెలియజేయాలనిపించి ఇది రాస్తున్నాను.



**దేనికి ఎంత సమయం..**

ప్రతి చిన్నారికి 8 నుంచి 10 గంటల నిద్ర అవసరం అనే ప్రాథమిక విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలి. ఆ తర్వాతే అదనపు తరగతులు, ట్యూషన్స్, క్రీడలు ఇంకా ఏవైనా చిన్నారి ప్రణాళికలో చేర్చాలి. నిద్ర, రోజువారీ వ్యక్తిగత పనులు, పాఠశాల. ఇవి తప్పనిసరి కావడంతో వాటికి సమయం కేటాయించాలి. తర్వాత హోంవర్క్, ఆటలు, కుటుంబంతో గడపడం, టీవీ, సెల్‌ఫోన్ ఇలా ఉన్న అవకాశాలకు ఎంత సమయం వెచ్చించగలమో ఆలోచించి. అందులో ప్రధానమైన వాటికి, సెలవుల్లో చేయాల్సినవి విభజించుకొని ప్లాన్ చేసుకోవాలి.

**ఈ ప్రశ్నలు అడగండి..**

పాఠశాల నుంచి రాగానే యూనిఫాం మార్చాక తల్లిదండ్రులు చిన్నారులతో కాసేపు మాట్లాడాలి. 'స్కూల్‌లో ఏం చేశారు? లంచ్ బాక్స్ బాగుందా? ఖాళీ సమయంలో ఆడుకున్నారా? బస్సులో రోజూ కూర్చునే సీటే దొరికిందా?' ఇలా సరదాగా మొదలుపెట్టి.. నెమ్మదిగా హోంవర్క్‌లోకి తీసుకెళ్లాలి. వారితో పాటు తల్లిదండ్రులూ ఓ పుస్తకం పట్టుకొని కూర్చోవాలి.

**స్క్రీన్ సమయం..**



తల్లిదండ్రులతో పాటు పిల్లలకూ వ్యక్తిగతంగా ఫోన్లు ఉంటున్నాయి. ఇంట్లో టీవీ సరేసరి, ఎవరి మొబైల్‌ను వారు చూస్తూపోతున్నారు. ఎక్కువ సేపు స్క్రీన్ చూస్తే నిద్ర పోవడానికి,

లేవడానికి కారణమైన మెదడులోని 'అమిగ్దలా' అనే భాగంపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా నిద్రకు ఉపక్రమించే 2 గంటల ముందు స్క్రీన్‌ను చూడొద్దు.

**ఇవి చేస్తే సరి..**

రాత్రి భోజనాన్ని పిల్లలు 7.30-8 గంటల మధ్యలో తినాలి. భోజనంలో అన్నీ కార్బొహైడ్రేట్స్ కాకుండా ఫైబర్, ప్రొటీన్ ఉండేలా చూసుకోవాలి. ఎట్టి



పరిస్థితుల్లోనూ 9 గంటలకల్లా పడుకోవాలి. రాత్రి పడుకునే ముందు నీళ్ల సీసాను పక్కన పెట్టుకోవాలి. లేచాక మొదట నీళ్లు తాగాలి. అప్పుడు సులువుగా కడుపు ఖాళీ అవుతుంది. చిన్నారులు మళ్లీ పడకపైకి చేరరు.

**తల్లిదండ్రులూ మీకోసమే..**

"ఇది చేయాలి, అలా చేయాలి, ఇప్పుడు పడుకో.. తిను, తినొద్దు" అని ఆర్డర్లు వేస్తే పిల్లలు అసలు వినరు. వారితో ఏం చేయించాలనుకుంటున్నారో తల్లిదండ్రులూ అది చేయాలి. ఓ 15 రోజులు తల్లిదండ్రులు కూడా చేస్తే పిల్లలకు అలవాటు అవుతుంది. రోజూ పడుకునే ముందు బ్రష్ చేసుకోవాలని చెప్పడం కన్నా. పెద్దలూ చేస్తుంటే వారికి క్రమంగా అలవాటవుతుంది".

చాలా ఘటనల్లో తల్లిదండ్రులు వారి సమయ పాలనలో మార్పులు చేసుకోవాల్సి ఉంది. ముందు పెద్దలు మారితే పిల్లలు ఆ దారిలో పడతారు. చెప్పి చేయాలనడం కాదు.. చేతలే సులువుగా మారుస్తాయనే చక్కటి చిట్కా పాటించాలి" అని చక్కగా శ్రీనాథాచారి వివరించారు. ★

---



**ఆళ్లగడ్డ :-** శ్రావణమాసం రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆళ్లగడ్డ భారతి విద్యా మందిరం(రామాలయం) పాఠశాలలో ఉదయం వరలక్ష్మీ వ్రతం బ్రాహ్మణ వేదమంత్రోచ్చారణ తో జరిగినది, మహిళా మాతృమూర్తులు భగవద్గీత పారాయణం చేశారు సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ట జరిగినది, మండపము, సరస్వతి దేవి విగ్రహము కీర్తిశేషులు అన్నయ్యా చారి శ్రీమతి లక్ష్మీదేవి గారు పాఠశాలకు విరాళంగా అందించారు వారిని పాఠశాల తరపున సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు,పోషకులు,మహిళలు,మాతాజీలు మరియు భజన బృందం పాల్గొన్నారు. ★

---





మంచిర్యాల గణిత విజ్ఞాన మేళ లో శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు గారు మంచిర్యాల ఎమ్మెల్యే మరియు కార్పొరేటర్స్ మరియు జిల్లా సైన్స్ అధికారి మరియు ఎంఈఓ గారు మరియు మేయర్ ధరణి మధుకర్ గారు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ★

# విలువల విద్య (Value Education)



– కొత్తపల్లి ఉమ,
ప్రాంత శిశువాటిక ప్రముఖ్, తెలంగాణ

3–8 సంవత్సరాల పిల్లల కోసం విలువల విద్య (Value Education) – కేస్ స్టడీలు

క్రింది కేస్ స్టడీలు 3 నుండి 8 సంవత్సరాల పిల్లలలో నిజాయితీ, దయ, గౌరవం, బాధ్యత, క్రమశిక్షణ, సహకారం, పర్యావరణ ప్రేమ వంటి విలువలను పెంపొందించడానికి ఉపయోగపడతాయి.

**1. వయస్సు: 3 సంవత్సరాలు**

విలువ: పంచుకోవడం (Sharing)

కేస్ స్టడీ: "రాము బొమ్మ"

రాము తన కొత్త కారు బొమ్మతో ఆడుకుంటున్నాడు. అతని స్నేహితుడు రాజు కూడా ఆ బొమ్మతో ఆడాలని కోరాడు. కానీ రాము ఇవ్వలేదు. రాజు బాధపడ్డాడు. టీచర్ ఇద్దరినీ పిలిచి, "మన బొమ్మలను పంచుకుంటే ఇద్దరికీ ఆనందం కలుగుతుంది" అని చెప్పింది. రాము తన బొమ్మను రాజుకు ఇచ్చాడు. ఇద్దరూ కలిసి సంతోషంగా ఆడుకున్నారు.

చర్చ ప్రశ్నలు:

రాము మొదట ఎందుకు ఇవ్వలేదు?

చివరికి ఏమి చేశాడు?

నువ్వు నీ బొమ్మలను పంచుకుంటావా?

విలువ: పంచుకోవడం, స్నేహం

**2. వయస్సు: 4 సంవత్సరాలు**

విలువ: నిజం చెప్పడం (Honesty)

కేస్ స్టడీ: "పగిలిన కప్పు"

సీత ఆడుకుంటూ ఒక కప్పును పగలగొట్టింది. మొదట భయపడి దాచింది. తర్వాత అమ్మ దగ్గరకు వెళ్లి, "అమ్మా, నా వల్ల కప్పు పగిలింది. క్షమించు" అని నిజం చెప్పింది. అమ్మ కోపపడకుండా, "నిజం చెప్పినందుకు నిన్ను అభినందిస్తున్నాను" అంది.

చర్చ ప్రశ్నలు:

సీత ఎందుకు భయపడింది?

చివరికి ఏం చేసింది?

నిజం చెప్పడం ఎందుకు మంచిది?

విలువ: నిజాయితీ

**3. వయస్సు: 5 సంవత్సరాలు**

విలువ:పరిశుభ్రత (Cleanliness)

కేస్ స్టడీ: "చెత్త ఎక్కడ వేయాలి?"

పార్కులో బిస్కెట్ తిన్న అర్జున్ కవర్ను నేలపై పడేశాడు. అతని స్నేహితురాలు అనన్య, "చెత్తను డస్ట్‌బిన్‌లో వేయాలి" అని చెప్పింది. అర్జున్ వెంటనే తీసుకుని డస్ట్‌బిన్‌లో వేశాడు.

చర్చ ప్రశ్నలు:

చెత్తను ఎక్కడ వేయాలి?

పార్కును శుభ్రంగా ఉంచడం ఎవరి బాధ్యత?

విలువ: పరిశుభ్రత, బాధ్యత

**4. వయస్సు: 6 సంవత్సరాలు**

విలువ: గౌరవం (Respect)

కేస్ స్టడీ: "అమ్మమ్మకు సహాయం"

పాఠశాల నుంచి వచ్చిన నేహా, అమ్మమ్మ నీళ్ల బిందె ఎత్తలేకపోతున్నట్లు చూసింది. వెంటనే వెళ్లి సహాయం చేసింది. అమ్మమ్మ ఆమెను ఆశీర్వదించింది.

చర్చ ప్రశ్నలు:

నేహా ఏమి చేసింది?

పెద్దలకు ఎలా సహాయం చేయాలి?

విలువ: పెద్దల పట్ల గౌరవం, సేవాభావం

**5. వయస్సు: 7 సంవత్సరాలు**

విలువ: బాధ్యత (Responsibility)

కేస్ స్టడీ: "మొక్కకు నీరు"

పాఠశాలలో ప్రతి విద్యార్థికి ఒక మొక్కను ఇచ్చారు. రాహుల్ ప్రతిరోజూ తన మొక్కకు నీరు పోసేవాడు. అతని మొక్క బాగా పెరిగింది. మరొక విద్యార్థి మొక్కకు నీరు పోయకపోవడంతో అది ఎండిపోయింది.

చర్చ ప్రశ్నలు:

రాహుల్ మొక్క ఎందుకు బాగా పెరిగింది?

మన బాధ్యతలను ఎందుకు నెరవేర్చాలి?

విలువ: బాధ్యత, ప్రకృతి ప్రేమ

**6. వయస్సు: 8 సంవత్సరాలు**

విలువ: సహకారం (Cooperation)

కేస్ స్టడీ: "కలిసి గెలిచిన జట్టు"

పాఠశాలలో చిత్రలేఖన పోటీ జరిగింది. ఒక బృందంలోని పిల్లలు పనిని పంచుకుని కలిసి చేశారు. అందరూ ఒకరికి ఒకరు సహాయం చేశారు. వారి బృందం మొదటి బహుమతి గెలుచుకుంది.

చర్చ ప్రశ్నలు:

వారు ఎలా విజయం సాధించారు?

కలిసి పని చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉంటుంది?

విలువ: సహకారం, జట్టుగా పని చేయడం

ఉపాధ్యాయుల కోసం కార్యాచరణలు (Follow-up Activities)

పాత్రాభినయం (Role Play)

బొమ్మల ద్వారా కథ చెప్పడం

చిత్రలేఖనం

మంచి అలవాట్ల చార్ట్ తయారు చేయడం

"నేను ఈ రోజు చేసిన మంచి పని" పంచుకోవడం

విలువలపై పాటలు, పద్యాలు

చిన్న నాటికలు

తరగతి చర్చలు

నేర్చుకున్న విలువల సారాంశం

వయస్సు । విలువ । ప్రధాన సందేశం ।

3 సంవత్సరాలు । పంచుకోవడం । పంచుకుంటే ఆనందం పెరుగుతుంది. ।

। 4 సంవత్సరాలు । నిజాయితీ । ఎప్పుడూ నిజం చెప్పాలి. ।

। 5 సంవత్సరాలు । పరిశుభ్రత । పరిసరాలను శుభ్రంగా ఉంచాలి. ।

। 6 సంవత్సరాలు । గౌరవం । పెద్దలను గౌరవించి సహాయం చేయాలి. ।

। 7 సంవత్సరాలు । బాధ్యత । మన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలి. ।

। 8 సంవత్సరాలు । సహకారం । కలిసి పనిచేస్తే విజయం సులభం. ।

ఈ కేస్ స్టడీలు NEP 2020 మరియు NCF-Foundational Stage 2022లో సూచించిన విలువల ఆధారిత, అనుభవాత్మక మరియు చర్చా-ఆధారిత అభ్యాసానికి అనుకూలంగా రూపొందించబడ్డాయి. ★

## కార్గిల్ వీరులకు ఘన నివాళి




**తాండూర్ :** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో కార్గిల్ యుద్ధంలో అమరులైన భారత వీర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్య క్రమానికి విశిష్ట అతిథిగా భారత ఆర్మీ సైనికుడు వెంకయ్య గారు విచ్చేసి, కార్గిల్ యుద్ధంలో భారత సైనికుల ధైర్యసాహసాలు, త్యాగాలు, దేశభక్తి గురించి విద్యార్థులకు ప్రేరణాత్మకంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో ప్రబంధకారిణి, ఆచార్య బృందం, మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, వీర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించు కుంటూ, దేశభక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. ★

## రైలులో మరపురాని

# సంగీతానుభవం

- తిరుమలేశ్

రైలులో మరపురాని సంగీతానుభవం - శిశు మందిర పాఠశాలల సంస్కారానికి నిదర్శనం.

ఇటీవల మేమందరం కర్ణాటక రాష్ట్రంలోని గదగ్ ప్రాంతానికి క్షేత్ర బైఠక్ కార్యక్రమానికి వెళ్లాము. కార్యక్రమం పూర్తయిన అనంతరం గదగ్ నగరంలోని కొన్ని ప్రముఖ దేవాలయాలను దర్శించుకొని, ఆ రాత్రి తిరుగు ప్రయాణానికి రైలులో ఎక్కాము. మన తెలంగాణ ప్రాంత బృందం వివిధ బోగీల్లో తమ తమ సీట్లలో కూర్చున్నాము.

నేను కూర్చున్న సీటు పక్కన ఒక నవయువకుడు ఉన్నాడు. రాత్రంతా అతను తన మొబైల్‌లో ఏదో చూస్తూ, హెడ్‌ఫోన్లతో వింటూ ఉన్నాడు. ఈ రోజుల్లో యువత ఎక్కువగా సినిమాలు, వినోద కార్యక్రమాలు లేదా సామాజిక మాధ్యమాల్లో గడుపుతుంటారు. అందువల్ల అతను ఏమి చూస్తున్నాడో అనే ఆసక్తి నాకు కలిగింది.

తెల్లవారుజామున బ్రహ్మముహూర్తంలో కూడా అతను అదే పనిలో నిమగ్నమై ఉండటంతో కొద్దిగా గమనించాను. ఆశ్చర్యకరంగా అతను దేశభక్తి గీతాలు, ప్రముఖ సంగీత విద్వాంసుల గానాలను ఎంతో శ్రద్ధగా వింటున్నాడు. జీన్స్ ప్యాంటు, టీ-షర్ట్ ధరించి, ఆధునిక శైలిలో కనిపిస్తున్న ఆ యువకుడు వినోదానికి కాకుండా విలువైన సంగీతాన్ని ఆస్వాదించడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది.

ఉదయం అల్పాహారం అనంతరం అతనితో పరిచయం చేసుకున్నాను. "మీరు ఎవరు? ఎక్కడి నుండి వస్తున్నారు?" అని అడిగాను. అతను ఎంతో వినయంగా సమాధానమిస్తూ, "నేను విద్యార్థిని. ఢిల్లీలో సంగీతంలో డిప్లొమా చేస్తున్నాను. మా స్వస్థలం ఒడిశా. నేను శిశు మందిరంలో చదివాను. మా నాన్నగారు ఆరెస్సెస్ నగర కార్యవాహగా సేవలందిస్తున్నారు" అని చెప్పాడు.

మరొక విశేషం ఏమిటంటే, అతను తనతో పాటు ఒక తబలాను కూడా తీసుకువచ్చాడు. అతను ప్రతిభావంతుడైన తబలా వాదకుడు. వెంటనే మా బృందంలోని ప్రముఖ క్షేత్ర గాయకులు శ్రీ సాయినాథ్ గారు గానాన్ని ప్రారంభించగా, ఈ యువకుడు తబలాతో అద్భుతంగా సహకరించాడు.

కొద్ది క్షణాల్లోనే రైలు బోగీ ఒక చిన్న సంగీత సభగా మారిపోయింది. మేమంతా ఆ సంగీతంలో మైమరచిపోయాము. మా బృందం మాత్రమే కాదు, అక్కడికి వచ్చిన టీటీ, రైల్వే సిబ్బంది, ఇతర ప్రయాణికులు కూడా వచ్చి ఆసక్తిగా విని ఆనందించారు. ఆ ప్రయాణం అందరికీ మరపురాని అనుభూతిగా నిలిచిపోయింది.

ఈ సందర్భంగా నేను అతనితో మాట్లాడుతుండగా క్షేత్ర ప్రశిక్షణ ప్రముఖ్ సూర్య నారాయణ గారు కూడా వచ్చి, "మీ పాఠశాల నాకు తెలుసు. నేను కూడా అక్కడికి వచ్చిన సందర్భం ఉంది" అని చెప్పడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది.

ఈ సంఘటన నాకు ఒక గొప్ప విషయాన్ని గుర్తుచేసింది. శిశుమందిరం కేవలం పాఠ్యపుస్తకాల విద్యనే కాకుండా, సంస్కారం, దేశభక్తి, సంగీతాభిరుచి, వినయం, వ్యక్తిత్వ వికాసం వంటి విలువలను కూడా విద్యార్థుల్లో పెంపొందిస్తుంది. అందుకే అక్కడ చదివిన విద్యార్థులు ఎక్కడ ఉన్నా తమ ప్రవర్తన, సంస్కారం, ప్రతిభ ద్వారా సమాజంలో ప్రత్యేక గుర్తింపును పొందుతుంటారు.

నేడు మనమంతా శిశుమందిరంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులుగా ఇలాంటి విద్యార్థులను తీర్చిదిద్దే పవిత్రమైన బాధ్యతను నిర్వహిస్తున్నాము. భవిష్యత్తులో సమాజంలో ఆదర్శప్రాయులుగా ఎదిగే ప్రతి విద్యార్థి మన కృషికి ప్రతిరూపం. అలాంటి సంస్కారవంతులైన పౌరులను

తీర్చిదిద్దడం కంటే గొప్ప సేవ మరొకటి లేదు.

ఈ రైలు ప్రయాణం నాకు సంగీతానందాన్ని మాత్రమే కాదు, శిశుమందిర విద్య యొక్క గొప్పతనాన్ని మరోసారి ప్రత్యక్షంగా అనుభవించే అవకాశాన్ని కూడా కల్పించింది. ★

---

(16వ పుట తరువాయి భాగం ...)

జీవించగలడు. మనసు వల్ల కోరికలు, సుఖదుఃఖాలు, మమకారాలు, బుద్ధి వల్ల మేధస్సు, నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు, వివిధ కళల సృష్టి, ఆత్మ వల్ల కుటుంబం, సమాజం, సృష్టి, పరిమేష్టితో తాదాత్మ్యం చెందడం ప్రతి మనిషి సహజ లక్షణం. పూర్వకాలంలో రుషులు, మునులు, తత్త్వవేత్తలు ఈ పరమసత్యాన్ని గుర్తించి విశ్వమానవ కల్యాణాన్ని ఆశించి, ఉత్తమ సాంస్కృతిక జీవన మూల్యాలను మనకు అందించారు. వేయి సంవత్సరాల విదేశీ దండయాత్రలతో దేశం పరాధీనమైన కారణంగా భారతీయ జీవన విలువల పరంపర మరుగున పడిపోయింది. జాతి ఆత్మ విస్మృతి చెందింది. దేశం స్వతంత్రమైన తర్వాత కూడా మన పాలకులు, నాయకులు పశ్చిమ దేశాల సిద్ధాంతాల మోజులో పడి.. దారీ తెన్నూ తెలియని గందరగోళం సృష్టించారు. పేదరికం, అవిద్య, అవినీతి, అక్రమాలు, అరాచకత్వం వికృతరూపం దాల్చాయి. రష్యా నమూనా ప్రణాళికలను గుడ్డిగా అనుసరించడం–మనదేశ వనరులు–జనాభా– సాంప్రదాయాలు–అవసరాలను గుర్తించకుండా విచ్చలవిడి యాంత్రీకరణ వల్ల జన జీవనం దుర్భరమైంది. ఆర్థిక సామాజిక అసమానతలు పెరిగాయి. ఈ దుస్థితిని అధిగమించడానికి మానవజాతి మొత్తానికి కళ్యాణ కారిణి అయిన మార్గాన్ని ప్రతిపాదించాడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ. అదే– 'ఏకాత్మ మానవ వాదం'. మనిషి సంపూర్ణ వికాసం చెందినపుడే సుఖసంతోషాలు లభిస్తాయి. సంపూర్ణ వికాసం అంటే శరీరం–మనసు –బుద్ధి–ఆత్మ అనే నాలుగింటి అవసరాలు నెరవేరడం. ఇది నెరవేరడానికి మన పూర్వీకులు నాలుగు పురుషార్థాలు సూచించారు.

శరీర అవసరాల కోసం– కామం అనగా కోరికలు తీరడం కోసం ధనం సంపాదించాలి. దాన్ని ధర్మబద్ధంగా సంపాదించినపుడే సుఖం అనుభవిస్తాడు. ధర్మం అంటే మతం–పూజలు– వ్రతాలు కావు. ఏది మంచి? ఏది చెడు? అని చెప్పేదే ధర్మం. మంచిని పెంచడం ధర్మం. అక్రమాలను అరికట్టడం ధర్మం. ఆపదలో ఉన్నవాడిని ఆదుకోవడం ధర్మం. మానవహితం కోరేది, సృష్టిహితం కోరేది ధర్మం. మనం చేసే ప్రతి పనికీ దిక్సూచి ధర్మం. ధర్మబద్ధంగా సంపాదించిన ధనంతోనే శారీరక అవసరాలు, కోరికలు తీర్చుకుంటూ మనిషి తృప్తిగా, ఆనందంగా జీవించగలడు. సమాజం గురించి కూడా పాటుపడగలడు. మనిషి తనకు తాను సంపూర్ణుడు కాడు. కుటుంబం, గ్రామం, సమాజం, దేశం, విశ్వం దాకా వికసించి వాటితో మమేకమౌతాడు. సాటి మనిషి దుఃఖిస్తుంటే సంతోషించలేడు. వరదలు, తుఫానులు, యుద్ధాలు, కరువుకాటకాలు, భూకంపాలు ప్రపంచంలో ఎక్కడ సంభవించినా మనిషి చలించిపోతాడు. సకల సంపదలున్నా సుఖపడలేడు. కారణం అన్నింటిలో ఉన్నది ఒకే ఆత్మ కనుక. భౌతికవాదం ఈ అంశాలను గమనించదు. ఇలా.. ప్రతిపాదిస్తూ.. విశ్వ మానవ కల్యాణమే లక్ష్యంగా మన జీవన వ్యవస్థ ఏర్పడిందని, ఈశ్వరుణ్ణి చేరుకోవడం కూడా ఓ లక్ష్యమేనని ప్రతిపాదించారు.

దీనదయాళ్ ప్రతిపాదించిన పరిపాలన, రాజకీయాల ప్రత్యామ్నాయ విధానాలు నేడు ప్రపంచంలో అనేక మంది ఆలోచనాపరుల దృష్టిని ఆకట్టు కొంటున్నాయి. కేవలం భారత దేశం సమగ్రాభివృద్ధి చెందడం కోసమే కాకుండా, మొత్తం విశ్వ మానవాళి సంతోషంగా జీవించడం కోసం ప్రాతిపదికగా సిద్ధాంతాలను ప్రతిపాదించారు. నేడు మన దేశంలో దాదాపు అన్ని ప్రభుత్వాలు తమ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఈ ఆలోచనే ప్రధాన కేంద్రంగా కొనసాగుతున్నదని చెప్పవచ్చు. ★

---

**ప్రతి వ్యక్తి సత్యవాది కావాలి.**
**సుఖశాంతుల కోసం పరస్పరం**
**సహకరించుకోవాలి.**
**– శ్రీ నారాయణ గురు**

# ఆణిముత్యం - మన పూర్వ విద్యార్థి



– సి. రాజారెడ్డి

ఆయన ఓ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, అక్కపల్లిగూడెం గ్రామం, జన్నారం మండలం.

"మీరు ఎక్కడ ఉంటే మేము అక్కడే.." అంటూ ఆయనతో పాటు ఆయన పనిచేసే బడికి తరలివచ్చే విద్యార్థి గణం.

ఆయన ఏ బడిలో పనిచేసినా, ఆ బడిలో గణనీయంగా పెరిగే విద్యార్థుల ఎన్రోల్మెంట్. పాఠశాలకు "నో అడ్మిషన్స్ క్లోజ్" బోర్డు పెట్టే పరిస్థితి. సుమారు పదహారు పంచాయితీల పరిధి నుండి పిల్లలు ఈ పాఠశాలలో ప్రవేశాలు తీసుకోవటం విశేషంగా చెప్పుకోవలసిన విషయం.

ప్రభుత్వ పాఠశాలలు వెలవెలబోతున్న ఈ కాలంలో, అన్ని పాఠశాలలకు భిన్నంగా ఈ పాఠశాల తీరు ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

ఏమిటి ఈ పాఠశాల ప్రత్యేకత, ఎందుకు ఈ పాఠశాల మీద పిల్లలకు మక్కువ ఎక్కువ అని తెలుసుకునే ప్రయత్నం చేస్తే, ఆ పాఠశాలలో వసతులకు, సౌకర్యాలకు లోటు లేదు, ఉపాధ్యాయులు చక్కగా అంకితభావంతో పనిచేస్తున్నారు, త్రాగు నీటి వసతి మరియు మూత్రశాలల వసతి కూడా చక్కగా ఉంది, ఆట వస్తువులు మరియు ఇతరత్రా ఏర్పాట్లు అన్నీ కూడా ఉన్నంతలో చక్కగా ఏర్పాటు చేసుకున్నారు.

పిల్లలు సౌకర్యవంతంగా సురక్షితంగా, సంతోషంగా, ఆహ్లాదంగా పాఠశాలలో గడుపుతూ విద్యాబుద్ధులు నేర్చుకునేవిధంగా చేసిన ఏర్పాట్లే, పిల్లలు ఆ పాఠశాల పై ఆసక్తి కలిగి ఉండడానికి కారణం.

అంతే కాకుండా ఆటలు, పాటలు, బోధనా పద్ధతులు, కోకర్రిక్కులర్ యాక్టివిటీస్ నిర్వహణ, పిల్లలతో మమేకమై పనిచేసే అధ్యాపకుల తీరు పిల్లలను మరియు పోషకులను ఆకర్షించింది.

ఇన్ని మంచి విషయాలు ఒక ప్రభుత్వ పాఠశాలలో ఎలా సాకారం అయ్యాయి అని ఆశ్చర్యపోయే తరుణంలో, అందుకు కారకులైన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడైన శ్రీ జాజాల శ్రీనివాస్ గారిని ప్రభుత్వం గుర్తించడం జరిగింది. ఆ క్రమంలో విదేశాలలో బోధనా పద్ధతుల అధ్యయనానికై ఎంపిక చేసిన 25 మంది అధ్యాపక బృందంలో జాజల శ్రీనివాస్ గారికి కూడా స్థానం దక్కడం గర్వించదగ్గ విషయం.

జాజాల శ్రీనివాస్ గారు విదేశీ పర్యటనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఫిన్లాండ్ దేశానికి వెళ్లి ఏడు రోజులపాటు మూడు పాఠశాలలను సందర్శించి అక్కడి బోధనా పద్ధతులను, విద్యార్థుల సర్వాంగీణ వికాసం కోసం అక్కడి పాఠశాలలు చేస్తున్న వినూత్న ప్రయత్నాలను పరిశోధించి తిరిగి వచ్చి ప్రభుత్వానికి విన్నవించడం జరిగింది. అంతేకాకుండా విదేశీ పర్యటనకు వెళ్లి వచ్చిన తర్వాత జాజాల శ్రీనివాస్ గారు పనిచేస్తున్న పాఠశాలలో గతంలో 270 సంఖ్యలో విద్యార్థులు ఉండగా ఈ విద్యా సంవత్సరం 500 సంఖ్యలో గరిష్ఠంగా విద్యార్థులు ఎన్రోల్మెంట్ కావడం చాలా గొప్ప విషయంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడమే కాక తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్య మంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారు స్వయంగా వారిని సన్మానించి, సత్కరించడం జరిగింది.

ప్రాథమిక పాఠశాలలో గరిష్ఠంగా 500 సంఖ్యలో విద్యార్థులు ఉండడం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే ఏకైక పాఠశాలగా, జాజాల శ్రీనివాస్ గారు పనిచేసే అక్కపల్లిగూడెం పాఠశాల అని గుర్తించడం జరిగింది.

వీటన్నిటికీ కారణం ఏమిటి..?

ఇంత అద్భుతంగా ఒక ప్రభుత్వ పాఠశాల ప్రాముఖ్యతను

సంతరించుకోవడంలో విశేషమేమిటి..?

అని జాజల శ్రీనివాస్ గారిని తెలుసుకోగా..

నేను శ్రీ సరస్వతీ విద్యాపీఠం నిర్వహిస్తున్న, శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం రాంపూర్, మంచిర్యాల పాఠశాలలో విద్యను అభ్యసించాను అని తెలుపుతూ, నేను చదువుకున్న శ్రీ సరస్వతీశిశు మందిర్ పాఠశాలలో నేర్చుకున్న విషయాలు నా వ్యవహార శైలికి మూలమని చెప్పారు.

నేను చదువుకున్న పాఠశాలలోనే కొంతకాలం ఆచార్యుడిగా కూడా పనిచేసానని, శ్రీ సరస్వతీ విద్యాపీఠం వారు నిర్వహించే ఆచార్య ప్రశిక్షణా వర్గలకు హాజరై శిక్షణ పొందడం నా పనితీరుకు కారణమని తెలిపారు.

అక్కడ అలవర్చుకున్న సంస్కారాలు, అక్కడ శిక్షణ పొందిన బోధనా పద్ధతులు, నేను చదువుకున్నప్పుడు మాకు పాఠాలు చెప్పిన ఆచార్యుల అంకితభావం నన్ను ఈ విధంగా తీర్చిదిద్దాయని ఎంతో వినమ్రంగా చెప్పడం జరిగింది. ఉపాధ్యాయుడిగా పని చేయడం ఉపాధి కోసం కాదని అదొక పవిత్రమైన వృత్తిధర్మం అని అన్నారు.

ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణ కార్యంలో ముఖ్య భూమికను పోషించే పాత్ర అని, బడి బాగుంటే సమాజం బాగుంటుందని ఉపాధ్యాయుడు బాగుంటే భవిష్యత్ పౌరులు అద్భుతంగా తీర్చిదిద్దబడతారని నేను విశ్వసిస్తానని తెలిపారు.

అందుకు అనుగుణంగా పాఠశాల పోషకులను ప్రతినిత్యం కనీసం ఇద్దరు ముగ్గురిని కలుస్తూ వారితో పాఠశాల గురించి చర్చిస్తూ, సమాజ సహకారంతో సౌకర్యాలను ఏర్పాటు చేస్తూ తోటి ఉపాధ్యాయులతో కలిసి పిల్లల్లో పిల్లవాడిగా వ్యవహరిస్తూ, పిల్లలకు బడి పట్ల చదువు పట్ల ఆసక్తిని కలిగిస్తూ నా కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాను అని తెలియజేసారు.

ఆ విధంగా నలుగురికి ఆదర్శంగా ఉంటూ, వృత్తి ధర్మాన్ని దైవకార్యంగా నిర్వహిస్తూ, తాను చదువుకున్న శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో నేర్చుకున్న విషయాలను నేటితరం తన విద్యార్థులకు అలవరుస్తూ ముందుకు సాగుతున్న శిశు మందిర్ పూర్వవిద్యార్థి, శిశు మందిర్ పూర్వ ఆచార్యులు అయిన శ్రీ జాజాల శ్రీనివాస్ గారిని పూర్వ విద్యార్థి పరిషత్ మరియు శ్రీ సరస్వతీ విద్యాపీఠం హృదయపూర్వకంగా అభినందిస్తోంది.

భవిష్యత్తులో మరెన్నో విజయ శిఖరాలను అధిరోహించాలని, ఒక గురువుగా సమాజ నిర్మాణ కార్యంలో ఉత్తమ స్థానాలను అలంకరించాలని శ్రీ సరస్వతీ విద్యాపీఠం, తెలంగాణ మనసారా ఆకాంక్షిస్తోంది.

శ్రీ గురుభ్యోనమః..!! ★

## VOCATIONAL EDUCATION

KDR నగర్:- విద్యార్థులకు వృత్తి విద్యా (VOCATIONAL EDUCATION) కార్యక్రమంలో భాగంగా శ్రీ సరస్వతీ శిశుమందిర్, KDR నగర్, వనపర్తి పాఠశాలలో టైలరింగ్ మరియు కుట్లు, అల్లికలు విభాగాన్ని ప్రారంభించారు. విద్యార్థినులకు వాటిపై అవగాహన కల్పిస్తున్న శ్రీమతి హరిణి గారు (ప్రముఖ టైలర్, Embroidery & Mehendi expert, బ్యూటిషన్).



ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త, పాఠశాల హితైషులు కలకొండ రమేష్ గారు, పాలమూరు విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ కండె కృష్ణ మోహన్ గారు, జిల్లా కార్యకారిణి అధ్యక్షులు సూర్య నారాయణ గారు, కోశాధికారి గట్టుమీది భానుప్రసాద్ గారు, ప్రబంధకారిణి సభ్యులు కార్యదర్శి అరవింద్ ప్రకాష్ గారు, TAPUS జిల్లా అధ్యక్షులు కృష్ణ గారు, హితైషుల సమక్షంలో ప్రారంభం చేయడం జరిగింది. ★




శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల ఆదర్శ్ నగర్ లో ఆగస్టు 23 న విభాగ్ స్థాయి విజ్ఞాన మేళా జరిగింది. ఆదిలాబాద్ విభాగ్ అధ్యక్షులు భజరంగ్ లాల్ అగర్వాల్ గారు జ్యోతి ప్రజల్వన చేసి ఈ మేళాను ప్రారంభించారు. ఈ విజ్ఞాన మేళాలో 275 మంది విద్యార్థులు (శిశు వర్గ 88, బాల వర్గ 111, కిశోర వర్గ 76) మంది పాల్గొన్నారు. అలాగే ఆచార్యులు 29 మంది, న్యాయ నిర్ణేతలు 25 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనలు, ప్రహేళికలు, గణిత నమూనాలు మొదలైన అంశాలను ప్రదర్శించారు. అలాగే న్యాయ నిర్ణేతలు అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానమిచ్చారు. అలాగే తాము చేసిన ప్రాజెక్టులను వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగ్ కార్యదర్శి సరికొండ దామోదర్ గారు, జిల్లా ఉపాధ్యక్షులు ధర్మపురి సుదర్శన్ గారు, జిల్లా కార్యదర్శి పురస్తు గోపాల్ కిషన్ గారు తదితరులు పాల్గొన్నారు. ★

## కార్పొరేట్ స్కూల్స్ లో చదివించే స్తోమత వున్నా... శిశు మందిర్ నే ఎంచుకున్నా : జిల్లా జడ్జి



శ్రీ సరస్వతీ శిశు మందిర్ బడంగ్ పేట లో పోషకుల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి సి. విక్రమ్ గారు హాజరయ్యారు. వక్తగా తెలంగాణ ప్రాంత గోవా సేవా ప్రముఖ్ వేంకట నివాస్ గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి విక్రమ్ గారు మాట్లాడుతూ.. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూల్స్ వున్నా.. తన పిల్లల్ని మాత్రం శ్రీ సరస్వతీ శిశు మందిర్ లోనే చదివిస్తున్నానని తెలిపారు. విలువల ఆధారిత విద్యను సరస్వతీ శిశు మందిరాలు అందిస్తాయని, శిశు మందిరాల ప్రయాణం సమాజానికి స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.

ఇక.. తెలంగాణ ప్రాంత గోసేవా ప్రముఖ్ వేంకట నివాస్ గారు మాట్లాడుతూ విద్యార్థులు సరైన క్రమశిక్షణ, సమయపాలన మరియు సానుకూల దృక్పథంతో పాఠశాలకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ పాఠశాలకు రావడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే పిల్లల సంరక్షణ, విద్యను అందించడంలో కేవలం ఉపాధ్యాయుల పాత్రే వుండదని, తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకంగానే వుంటుందని అన్నారు. అలాగే ఇంట్లో సానుకూలమైన వాతావరణాన్ని సృష్టించుకోవాలని, దీని ద్వారా పిల్లలకు సరైన విలువలు, కుటుంబ ఆధారిత విలువలు అందుతాయన్నారు. ఈ కాలంలో సెల్ ఫోన్ల వినియోగం బాగా పెరిగిపోయిందని, దీంతో పిల్లల భవిష్యత్తు కూడా ఇబ్బందుల్లో పడిపోతోందన్నారు. అందుకే దీని విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చదువుతో పాటు పిల్లలకు ఇంట్లో మన సంప్రదాయ విలువలు, పురాణాల గురించి చెబుతూ వుండాలన్నారు. అప్పుడే ప్రయోజకులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ్ స్వబోధ ప్రముఖ్ నైని వేంకటేశ్వర్ గారు, పాఠశాల ప్రధానాచార్యులు శ్రీమతి రాపోలు స్వాతి గారు, పాఠశాల ఆచార్యులు పాల్గొన్నారు. ★

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణం ఆగస్టు 15న త్రివర్ణ పతాకాలతో, దేశభక్తి ఉత్సాహంతో నిండిపోయింది. పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ L. నరసింహారెడ్డి, గౌరవ అతిథిగా డా॥ చామర్తి ఉమామహేశ్వరావు, కార్యదర్శి NVK విశ్వేశ్వరావు, కోశాధికారి పసర్తి మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు రమ విశ్వనాథన్, కమిటీ సభ్యులు మేంగాని వెంకటస్వామి, పూర్వ ఛాత్ర పరిషత్ సహ సంయోజక్ రాజారెడ్డి విచ్చేసి వేడుకలలో పాల్గొన్నారు.

పాఠశాల మైదానంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ముఖ్య అతిథులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. 10వ తరగతి విద్యార్థిని హర్షిత ఈ రోజు యొక్క ప్రాముఖ్యతను సభకు వివరించారు. అనంతరం పాఠశాల మంత్రిమండలి విద్యార్థులు, NCC క్యాడెట్లు బ్యాండ్ ఘోష్ నడుమ ఆకట్టుకునే మార్చ్ పాస్ట్ నిర్వహించారు. విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గేయాలు, ప్రదర్శించిన నృత్యాలు మరియు వయుక్తిక్ గీతాలతో పాఠశాల ప్రాంగణమంతా దేశభక్తి స్ఫూర్తితో నిండిపోయింది.

ఈ సందర్భంగా ముఖ్య అతిథి జస్టిస్ L. నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యారణ్య పాఠశాల ప్రాంగణంలోని ప్రతి అణువులో దైవభక్తి మరియు దేశభక్తి కనిపిస్తున్నాయని అన్నారు. ఇలాంటి వాతావరణం ద్వారానే మనం ఉన్నతమైన దేశభక్తులుగా, బాధ్యత గల పౌరులుగా తయారవ్వగలమని తెలిపారు. 10, 11వ శతాబ్దాలలో భారతదేశం విశ్వ గురువుగా విరాజిల్లిందని, అనంతరం ముస్లింలు, బ్రిటిషర్ల పాలనలో దేశం సందిగ్ధంలో ఉన్నప్పటికీ వీరసావర్కర్, సుభాష్ చంద్రబోస్, జతిన్ దాస్, రాంప్రసాద్ బిస్మిల్ వంటి ఎందరో త్యాగధనులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మనకు స్వతంత్ర భారతాన్ని అందించారని గుర్తుచేశారు. ఆ వైభవాన్ని మనం మన ప్రతిభతో ముందుకు తీసుకెళ్లి భారతదేశాన్ని తిరిగి విశ్వ గురువుగా నిలపాలని పిలుపునిచ్చారు.

గౌరవ అతిథి డా॥ చామర్తి ఉమామహేశ్వరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తైనా దేశం ఇంకా సాధించాల్సింది చాలా ఉందని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో జరిగిన త్యాగాలను గుర్తుపెట్టుకోవడానికి, ముస్లిం మరియు బ్రిటిష్ పరిపాలనలో భారతదేశం ఎదుర్కొన్న కష్టాలనుండి ఎలా బయటపడిందో తెలుసుకోవడానికి, గతంలో ఉన్న విశ్వగురు స్థానాన్ని గుర్తు చేసుకోవడానికి మనం స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవాలని అన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం ఇవ్వడానికి సిద్ధపడే సంకల్పంతో ప్రతి ఒక్కరూ ఉండాలని పిలుపునిచ్చారు. వ్యక్తి నిర్మాణంలో శ్రద్ధ ఎంత ముఖ్యమో నచికేతుడు మరియు అష్టావక్రుని కథల ద్వారా వివరించారు. చిన్నతనం నుండే తమ ప్రజ్ఞపై శ్రద్ధ వహించి ఉన్నతమైన వ్యక్తులుగా తయారై దేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు ముందడుగు వేయాలని విద్యార్థులకు సూచించారు.

చివరగా వివిధ రంగాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమా విశ్వనాథన్ సమన్వయం చేశారు. ★

వార్తలు

# శ్రీ సరస్వతీ విద్యాపీఠం కర్నూలు విభాగ్
# ఫౌండేషన్ & ప్రిపరేటరీ లెవెల్ పంచపది శిక్షణ

శ్రీ సరస్వతీ విద్యాపీఠం కర్నూలు విభాగ్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ మరియు ప్రిపరేటరీ స్థాయిలో (1వ తరగతి నుండి 5వ తరగతి వరకు) బోధించే ఆచార్యుల కోసం పంచపది శిక్షణ కార్యక్రమం ఎన్. కొత్తపల్లి పాఠశాల కేంద్రంగా 2026 ఆగస్టు 1, 2 తేదీలలో విజయవంతంగా నిర్వహించబడింది.

ఈ రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో కర్నూలు మరియు నంద్యాల జిల్లాలకు చెందిన మొత్తం 76 మంది ఆచార్యులు పాల్గొన్నారు. వీరిలో 71 మంది మహిళా ఆచార్యులు మరియు 5 మంది పురుష ఆచార్యులు పాల్గొన్నారు.

ఈ శిక్షణా వర్గలో ప్రముఖ విద్యావేత్తలు, అనుభవజ్ఞులైన వనరుల వ్యక్తులు ఆచార్యులకు విలువైన మార్గదర్శనం అందించారు.

డా॥ జి. రామకృష్ణ రెడ్డి గారు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం అనంతపురం సమితి అధ్యక్షులు, దక్షిణ మధ్య క్షేత్ర కార్యకారిణి సభ్యులు, జాతీయ విద్యా విధానం--2020 (NEP-2020), ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN), 21వ శతాబ్దపు నైపుణ్యాలు, భావోద్వేగ మేధస్సు (EQ), కృత్యాధార బోధన, డిజిటల్ లిటరసీ, AI వినియోగం వంటి సమకాలీన అంశాలపై సమగ్రంగా వివరించి, నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయుల పాత్రను స్పష్టంగా వివరించారు.

విప్పల శివనాగి రెడ్డి గారు, నంద్యాల జిల్లా అధ్యక్షులు, అధ్యక్షీయ ప్రసంగంలో 21వ శతాబ్దపు నైపుణ్యాలు, డిజిటల్ విద్య, విద్యా యాప్‌ల వినియోగం, సాంకేతికతను బోధనలో సమర్థవంతంగా ఉపయోగించే విధానాలు గురించి వివరించి, ప్రతి ఉపాధ్యాయుడు నిరంతరం నేర్చుకుంటూ కాలానుగుణంగా తన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

ఈ. వెంకటయ్య గారు, విశ్రాంత ప్రభుత్వ పాఠశాల ఫిజిక్స్ అసిస్టెంట్, మాజీ భారత సైనికుడు (Ex-Army), "Innate Abilities (అంతర్గత శక్తులు)" అనే అంశంపై ప్రసంగిస్తూ ప్రతి బాలుడిలో సహజసిద్ధంగా **ఉన్న** ప్రతిభను గుర్తించి, దానిని వికసింపజేయడంలో ఉపాధ్యాయుని పాత్రను వివరించారు. తన సైనిక మరియు ఉపాధ్యాయ అనుభవాల ద్వారా క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం, ఆత్మవిశ్వాసం వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించాలని సూచించారు.

నాగిళ్ళ విజయకుమార్ గారు, విద్యాభారతి కర్నూలు విభాగ్ అకడమిక్ సంయోజక్, జ్ఞానార్జన ప్రక్రియ (Learning Process) మరియు పంచపది బోధనా విధానం గురించి సమగ్రంగా వివరించారు. బాలకేంద్రిత, కృత్యాధార, అనుభవాత్మక అభ్యసనం ద్వారా విద్యార్థులలో జ్ఞానం, నైపుణ్యాలు, విలువలు, సృజనాత్మకతను పెంపొందించే విధానాన్ని ఆచరణాత్మకంగా తెలియజేశారు.

ముగింపు కార్యక్రమంలో ఎం. చంద్రశేఖర ప్రసాద్ గారు ప్రధాన వక్తగా పాల్గొని భారతీయ విద్యా దృక్పథం, విలువలతో కూడిన విద్య, గురువు గొప్పతనం, సంస్కార నిర్మాణం మరియు విద్యార్థుల సమగ్ర వికాసంలో ఉపాధ్యాయుని పాత్ర గురించి స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ప్రతి ఆచార్యుడు తన తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి, జ్ఞానవంతమైన, సంస్కారవంతమైన, దేశభక్తి కలిగిన భావితరాన్ని తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ★

---

**జీవులందరికిని, అల్ప ప్రాణికి సైతం ప్రాణం అత్యంత ప్రియమైనది. ఏ ప్రాణి ప్రాణాన్ని గాని తీయుటకు ఎవరికిని హక్కులేదు.**

**– గౌతమ బుద్ధుడు**

## శ్రీ సరస్వతీ విద్యా నిలయం
## 1985-86 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**సూర్యాపేట:-** సూర్యాపేటలోని శ్రీ సరస్వతీ విద్యా నిలయంలో 1985-86 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం 02-08-2026న ఎంతో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు.

దాదాపు 40 సంవత్సరాలుగా ప్రతి 2-3 సంవత్సరాలకు ఒకసారి సమావేశమవుతూ స్నేహబంధాన్ని, గురుభక్తిని, పాఠశాలపై ఉన్న ప్రేమను నిలబెట్టుకుంటూ వస్తున్న ఈ బ్యాచ్ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా గత సంవత్సరం నుండి పాఠశాల ఇంగ్లీష్ మీడియంగా పునఃప్రారంభం కావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన పూర్వ విద్యార్థులు,






పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ ఆచార్యులను ఘనంగా సన్మానించి, వారి పట్ల ఉన్న కృతజ్ఞతాభావాన్ని చాటుకున్నారు. పాత మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ అందరూ ఆత్మీయంగా గడిపారు.

ఈ కార్యక్రమంలో డా॥ దండ మురళీధర్ రెడ్డి, అనంతుల కృపాకర్, గాలి రమేష్, సరళ, నూతన్, పాఠశాల కమిటీ వైస్ ఛైర్మెన్ గుండా రమేష్, సెక్రటరీ/కరస్పాండెంట్ పర్వతం శ్రీధర్, తదితరులతో పాటు పూర్వ ఆచార్యులు ఎన్. బ్రహ్మయ్య, పి. లచ్చిరెడ్డి, బి. అశోక్ రెడ్డి, జి. మధుసూదన్ రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

మొత్తం 65 మంది పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని స్నేహాన్ని, అనుబంధాన్ని, గురుభక్తిని మరొకసారి స్మరించుకున్నారు.

**"గురువుల ఆశీస్సులు - స్నేహితుల ఆత్మీయత - పాఠశాలపై మమకారం... ఇవే ఈ సమ్మేళనం యొక్క ప్రత్యేకత."** ★

## శ్రద్ధాంజలి



**కేశవనగర్:-** గొడవర్తి సూర్య ప్రకాష్ గారు వయస్సు 60 సంవత్సరాలు 11/8/2026 మంగళవారం రాత్రి 12:32 నిముషాలకు అనారోగ్యంతో స్వర్గస్తులయ్యారు. శ్రీ సరస్వతీ విద్యా మందిర్ కేశవనగర్ పాఠశాలలో 15 సంవత్సరాలు ఆచార్యగా సేవలందించారు. వారి ఆత్మకు శాంతి కలుగాలని శ్రీ సరస్వతీ విద్యాపీఠం శ్రద్ధాంజలి ఘటించింది.

★




శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆదర్శనగర్ లో ఆగస్టు 23 న విభాగ్ స్థాయి విజ్ఞాన మేళ జరిగింది. ఆదిలాబాద్ విభాగ్ అధ్యక్షులు భజరంగ్ లాల్ అగర్వాల్ గారు జ్యోతి ప్రజల్వన చేసి ఈ మేళాను ప్రారంభించారు. ఈ విజ్ఞాన మేళాలో 275 మంది విద్యార్థులు (శిశు వర్గ 88, బాల వర్గ 111, కిశోర వర్గ 76) మంది పాల్గొన్నారు. అలాగే ఆచార్యులు 29 మంది, న్యాయ నిర్ణేతలు 25 మంది పాల్గొన్నారు.
ఈ సందర్భంగా విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనలు, ప్రహేళికలు, గణిత నమూనాలు మొదలైన అంశాలను ప్రదర్శించారు. అలాగే న్యాయ నిర్ణేతలు అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానమిచ్చారు. అలాగే తాము చేసిన ప్రాజెక్టులను వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగ్ కార్యదర్శి సరికొండ దామోదర్ గారు, జిల్లా ఉపాధ్యక్షులు ధర్మపురి సుదర్శన్ గారు, జిల్లా కార్యదర్శి పురస్తు గోపాల్ కిషన్ గారు తదితరులు పాల్గొన్నారు.





సరస్వతీనగర్ కేంద్రంగా మార్చి 1 వ తేదీన పూర్త విద్యార్థి మహా సమ్మేళనం అనువర్తి కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా శ్రీ సరస్వతీ నగర్ పూర్వ విద్యార్థులు దాదాపు 6,00,000 రూపాయల వ్యయంతో ఆధునీకరించిన బౌద్ధిక్ మంటపాన్ని విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర రెడ్డి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ సరస్వతీ విద్యా పీఠం ప్రాంత పూర్వ విద్యార్థి పరిషత్ సంయోజకులు బొడ్డు శ్రీనివాస్ గారు ప్రస్తావన చేశారు. పూర్వ ఛాత్ర పరిషత్ సంపర్క్ అభియాన్ గురించి వివరించారు. పూర్వ విద్యార్థి పరిషత్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇందులో పూర్వ విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తమ తమ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి పూర్వ విద్యార్థులందరూ ముందుకు రావాలని సూచించారు.
ఇక.. లింగం సుధాకర రెడ్డి గారు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధికి, అకాడమిక్ విషయాలను మరింత మెరుగు పరిచేందుకు ప్రతి పూర్వ విద్యార్థి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే పాఠశాల పటిష్ఠత కోసం పూర్వ విద్యార్థులు చేయూతను అందివ్వాలని, పూర్తి బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు.
మరోవైపు రాష్ట్ర స్థాయిలో పదో తరగతి పరీక్షలలో మూడో ర్యాంక్ సాధించిన సరస్వతీ నగర్ విద్యార్థి కుమారి చైత్రను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆరెస్సెస్ ప్రాంత సంఘచాలకులు బర్ల సుందర్ రెడ్డి గారు, పాఠశాల ప్రబంధకారిణీ పాల్గొన్నారు. అలాగే 70 మంది పూర్వ విద్యార్థులు కూడా పాల్గొన్నారు.

RNI No. : 32283
SPHOORTHY (MONTHLY)
Volume : 50 Issue : 09
September - 2026

Postal Reg. No. : D/RNP/HCD-1204/2024-26
Published on 25th of Every Month
Posted on 29th & 30th Every Month
Posting at BPC-IV Partika Channel, Nampally, Hyderabad-01



బాగులవాడ:- శ్రీ సరస్వతీ విద్యాపీఠం నిర్మల్ కేంద్రంగా నిర్మించ తలట్టిన నూతన సి.బి.యస్.ఇ. పాఠశాల నిర్మాణం కోసం ప్రముఖ న్యాయవాది రాజ్య సభ సభ్యులు నిరంజన్ రెడ్డి గారు సిర్గాపూర్‌లోని తన 4 ఎకరాల భూమిని విద్యాపీఠానికి విరాళంగా ప్రకటించారు. అంతే కాకుండా ఆ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. వీటికి సంబంధించిన పత్రాలను విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి శ్రీమతి అనఘా వేంకటలక్ష్మి గారికి విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర ప్రశిక్షణ ప్రముఖ్ రావుల సూర్యనారాయణ గారికి అందించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ విభాగ్ పూర్వ విద్యార్థి పరిషత్ నిరంజన్ రెడ్డి గారికి ధన్యవాదాలు ప్రకటించింది.



శివరాంపల్లి:- ప్రాంత స్థాయి గణిత విజ్ఞానమేళాలో ప్రదర్శనలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

If undelivered please return to : Sri Saraswathi Vidya Peetham, 6-3-597/A/7, Venkataramana Colony, Khairatabad, Hyd-04.